PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 97 | విజయవాడ, శనివారం 8 నవంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 8 November 2025 | Rs

ఎస్ఐఆర్‌పై 11న అత్యవసర విచారణ

- సుప్రీంకోర్టు

7

శ్రీచరణికి రూ.2.5 కోట్ల ప్రోత్సాహకం

- గ్రూప్ 1 ఉద్యోగం, ఇంటి స్థలం కూడా
- ముఖ్యమంత్రితో మర్యాదపూర్వక భేటీ

2



శ్రీచరణిని అభినందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

వీధి కుక్కల నియంత్రణకు కంచెలు వేయండి

- సుప్రీంకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విద్యా సంస్థలు, బస్టాండ్, రైల్వేస్టేషన్, ఆస్పత్రులు, క్రీడా సముదాయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల సమీపం నుంచి వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని, ఆయా ప్రదేశాల్లోకి తిరిగి రాకుండా కంచెలు వేయాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ ప్రదేశాల్లో కుక్కలు లేవని నిర్ధారించుకునేందుకు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని పేర్కొంది. ఎనిమిది వారాల్లోగా అమలు విధానం, చర్యలపై స్టేటస్ రిపోర్టు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణను జనవరి 13కు వాయిదా వేసింది. వీధి కుక్కల కేసులో శుక్రవారం విచారణ చేపట్టిన జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వి అంజారియాతో కూడిన సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. జాతీయ రహదారులపైకి కుక్కలు, పశువులు రాకుండా చర్యలు తీసుకోవాలని, వాటి కోసం ఏర్పాటుచేసిన షెల్టర్లకు తరలించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, జాతీయ రహదారులశాఖ, స్థానిక సంస్థలు హైవే గస్తీ బృందాలకు ఆదేశాలిచ్చింది. రెండు వారాల్లోగా మున్సిపల్ సిబ్బంది వీధి కుక్కలు ఉండే స్థలాలను, భవనాలను గుర్తించాలని సూచించింది. వీధి కుక్కలను స్టెరిలైజేషన్ చేసి, రీ లొకేషన్ చేయాలని స్పష్టం చేసింది. అమికస్ క్యూరీ నివేదికలో పేర్కొన్న విషయాలు కోర్టు ఆదేశాల్లో భాగంగా పరిగణించబడతాయని పేర్కొంది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు ఆదేశాల అమలుకు బాధ్యత వహించాలని, విఫలమైతే వ్యక్తిగత చర్యలు తీసుకోబడతాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.



సభలో మాట్లాడుతున్న బి.వి రాఘవులు

సోషలిజానిదే భవిత

తొలి సోషలిస్టు విప్లవ దినోత్సవ సభలో బి.వి రాఘవులు

- న్యూయార్కు ఎన్నికల్లో రుజువైనది అదే
- విఫలమైన పెట్టుబడిదారీ విధానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రపంచవ్యాప్తంగా సోషలిజం పట్ల ఆకర్షణ పెరుగుతోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. తొలి సోషలిస్టు విప్లవ దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలో ఎన్‌టిఆర్ జిల్లా సిపిఎం కమిటీ ఆధ్వర్యాన రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు జరిగింది. అనంతరం మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో 'సోషలిజం ఔన్నత్యం సామ్రాజ్యవాద ప్రమాదం' అనే అంశంపై జరిగిన సభలో బి.వి రాఘవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా ఆర్థిక రాజధాని న్యూయార్కులో సోషలిస్టు జోహ్రాన్ మమ్దాని సాధించిన ఘన విజయాన్ని ప్రస్తావించారు. ప్రపంచ వ్యాప్త పెత్తనం కోసం, సామ్రాజ్యవాద విధానాల అమలుకోసం ఒత్తిడి చేస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో న్యూయార్క్ ప్రజానీకం సోషలిస్టు మమ్దాని వైపు నిలిచారని చెప్పారు. ఇదొక్కటే కాదని, ఇటీవల అమెరికాలో యువతపై నిర్వహించిన ఒక సర్వేలో 60 శాతం మంది సోషలిజం కావాలని కోరుకుంటున్నారని తేలిందని చెప్పారు. రాజరికపాలన మిగతా 2లో

సోషలిజంలో అన్నిటికీ గ్యారంటీ

'సోషలిస్టు వ్యవస్థలో ఇల్లు, తిండి, ఉపాధి, జీవనభృతి, సాగుభూమి అన్నీ హక్కుగా లభిస్తాయి. స్త్రీలకు సమానత్వం లభిస్తుంది. వాతావరణానికి రక్షణ ఉంటుంది. ప్రస్తుతం అన్ని నగరాల్లోనూ కాలుష్యం తీవ్రంగా ఉంది. పెట్టుబడిదారి విధానమే దానికి కారణం. సోషలిజంలో అటువంటి పరిస్థితి ఉండదు'

బి.వి. రాఘవులు



విజయవాడలో నిర్వహించిన ర్యాలీ

పోలవరం ముంపుపై మళ్లీ సర్వే

- 'అథారిటీ' భేటీలో నిర్ణయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టు ముంపు అంశంపై మరోసారి సర్వే చేయాలని పోలవరం అథారిటీ సమావేశం నిర్ణయించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని పోలవరం ప్రాజెక్టు అథారిటీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. ప్రాజెక్టు నిధుల దారి మళ్లింపు, పునరావాస పనుల జాప్యం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేసిన అథారిటీ..ఆ నిధులను తిరిగి 'పోలవరం' ఖాతాలో జమ చేయాలని ఆదేశించింది. అలాగే పునరావాస పనులను వేగిరం చేయాలని పేర్కొంది. డయాఫ్రం వాల్ పనులను 2026 మార్చి నాటికి, ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తిచేయాలని నిర్దేశించింది. 2027 జూన్ నాటికి ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామన్న ఏపి ప్రతిపాదనకు అంగీకరించలేదు. పోలవరం అథారిటీ కార్యాలయాన్ని రాజమండ్రికి తరలించాలని కూడా సమావేశంలో నిర్ణయించారు. అంతకుముందు కిన్నెరసాని, ముర్రేడు, మణుగూరు భారజల విద్యుత్ కేంద్రం ముంపునకు గురవుతున్నాయని తెలంగాణ పేర్కొంది. తాము 41.15 మీటర్ల పరిధికే ప్రాజెక్టును నిర్మిస్తున్నామని, ముంపు సమస్య రాదని ఏపి అధికారులు తెలిపారు. అయితే, అంతే ఎత్తులోని ఛత్తీస్‌గఢ్‌కు సర్వే నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇక్కడ కూడా నిర్వహించాలని తెలంగాణ అధికారులు చేసిన విజ్ఞప్తికి అథారిటీ సానుకూలంగా స్పందించింది. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు విషయాన్ని తెలంగాణ అధికారులు ప్రస్తావించగా పోలవరం అథారిటీకి సంబంధంలేని అంశమని ఏపి అధికారులు అభ్యంతరం తెలిపారు.

పోలవరం బనకచర్ల టెండర్లు రద్దు

పోలవరం బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి డిపిఆర్ తయారీకి గుంటూరు ఇరిగేషన్ అధికారులు పిలిచిన టెండర్లు రద్దయ్యాయి. గత నెల 31నే కాలపరిమితి ముగిసిందని, ఎవరూ టెండర్లు దాఖలు చేయకపోవడంతో ఇ-ప్రొక్యూర్‌మెంట్ సైట్లో అవి ఆటోమేటిక్‌గా రద్దు అయినట్లు అధికారులు తెలిపారు.

మరో 1.01 లక్షల కోట్లు

- ఎస్ఐపిబి సమీక్షలో పెట్టుబడులకు ఆమోదం
- 15 పారిశ్రామిక మండళ్లు.. ల్యాండ్ బ్యాంకు ఏర్పాటుకు సిఎం ఆదేశం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో మరో 1,01,899 కోట్ల రూపాయల పెట్టుబడులతో 26 పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఈ సమావేశంలో ఈ పరిశ్రమల ద్వారా 85,570 ఉద్యోగాలు అదనంగా లభిస్తాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ రాష్ట్రంలో 15 పారిశ్రామిక జోన్లతో పాటు, పరిశ్రమల అభివృద్ధికోసం ల్యాండ్ బ్యాంకును కూడా ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ప్రైవేటు వ్యక్తులను భూములిచ్చేందుకు ప్రోత్సహించాలన్నారు. పరిశ్రమలకు కావాల్సిన భూములు, విద్యుత్, ఇతర సౌకర్యాలను వెంటనే కల్పించాలని నిర్దేశించారు. పెట్టుబడిదారులనుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో భూమి కేటాయించినా ప్రారంభం కాని పరిశ్రమల వివరాలపై సమీక్షించాలని, పురోగతి లేని ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని సిఎం ఆదేశించారు. ప్రధానంగా ఎలక్ట్రానిక్ పార్కుల ఏర్పాటుపై ఎక్కువ దృష్టి పెట్టాలని, చిప్, సెమీ కండకర్లు, డ్రోన్ పరిశ్రమలకు మంచి అవకాశాలు ఉన్నాయని వివరించారు. పరిశ్రమలకు రాష్ట్రంతోపాటు కేంద్రం నుంచి కూడా ప్రోత్సాహకాలు వస్తాయని, ఒకవేళ కేంద్రం నుంచి రావడంలో జాప్యం జరిగినా రాష్ట్రం నుంచి ప్రోత్సాహకాలు వెంటనే ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

మెగా సిటీలకు మాస్టర్ ప్లాన్లు

రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటుచేసే మూడు మెగా సిటీలకు మాస్టర్ ప్లాన్లు సిద్ధం చేయాలని సూచించారు. అనకాపల్లి నుంచి విజయనగరం, విశాఖవరకు ఒక మెగా సిటీని, తిరుపతి, అమరావతి నగరాలను కలుపుతూ ఇంకో మెగా సిటీలకు మాస్టర్ ప్లాన్ తయారుచేయాలని, ఇప్పటికే అమరావతి మెగా సిటీకి మాస్టర్ ప్లాన్ ఉందని చంద్రబాబు వివరించారు. ఈ మెగా సిటీల్లో పర్యాటకం, ఐటి పరిశ్రమలు వచ్చేలా చూడాలన్నారు. ఇక్కడ టౌన్‌షిప్‌ల ఏర్పాటుపైనా చర్యలు తీసుకోవాలన్నారు.

పెట్టుబడుల సదస్సుకు విస్తృత ఏర్పాట్లు

ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహించే పెట్టుబడుల సదస్సుపైనా సమీక్షించారు. ఎస్ఐపిబి సమావేశంలో ఆమోదించిన పరిశ్రమల శంకు స్థాపనలు త్వరగా జరిగేలా చూడాలని నిర్దేశించారు. వీటి కోసం అధికారులు సన్నాహాలు చేయాలన్నారు. ఇటీవల తన విదేశీ పర్యటనలో అనేక మంది ఎపిలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారని, వారు కూడా ఈ సదస్సుకు వస్తారని చెప్పారు.

26 పరిశ్రమలకు ఆమోదం

తాజా సమావేశంలో 26 సంస్థల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఇందులో కీలకంగా ఇండిచిప్ సెమీ కండకర్స్ లిమిటెడ్ 22,976 కోట్లతో పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. అలాగే ఎన్‌పిఎస్‌పిఎల్ అడ్వాన్స్ మెటీరియల్ లిమిటెడ్ సంస్థ 2,081 కోట్లతో, క్రయాన్ టెక్నాలజీ సంస్థ 1,154 కోట్లతో, రహేజా సంస్థ 2,172 కోట్లతో, విశాఖ రియాల్టీ లిమిటెడ్ 2,200 కోట్లతో, ఎస్‌ఏఇఎల్ సోలార్ లిమిటెడ్ సంస్థ 1,728 కోట్లతో, నవయుగ ఇంజనీరింగ్ సంస్థ 7,972 కోట్లతో, సూపర్ స్మెల్టర్స్ లిమిటెడ్ 8,500 కోట్లతో, వాల్సన్ సంస్థ 1,682 కోట్లతో, ఎఎంజి మెటల్స్ లిమిటెడ్ 44 వేల కోట్లతో పెట్టే పరిశ్రమలకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేష్, అచ్చెన్నాయుడు, టిజి భరత్, నారాయణ, గొట్టిపాటి రవి, అనగాని సత్యప్రసాద్, బిసి జనార్దన్‌రెడ్డి, వాసంసెట్టి సుభాష్, సిఎస్ విజయానంద్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేమూరి కావేరి ట్రావెల్స్ యజమాని అరెస్టు

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్



వేమూరి కావేరి ట్రావెల్ బస్సు యజమాని వినోద్ కుమార్‌ను పోలీసులు ఎట్టకేలకు శుక్రవారం అరెస్టు చేశారు. కర్నూలు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ స్పెషల్ మొబైల్ కోర్టు (జెఎఫ్‌ఎంసి)లో హాజరు పర్చారు. కోర్టు రిమాండ్ విధించడంలో ఆయనను కర్నూలు జైలుకు తరలించారు. అనంతరం వినోద్ కుమార్ బెయిల్ పిటిషన్ వేశారు. దీనిపై విచారించిన జడ్జి అనూష ఆయనకు పది వేల రూపాయల సొంత పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేశారు. దీంతో, జైలు నుంచి వినోద్ కుమార్ విడుదలయ్యారు. కర్నూలు జిల్లా కల్లూరు మండలం చెట్లమల్లాపురం గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిపై గత నెల 24న వేమూరి కావేరి ట్రావెల్ బస్సు మోటారు బైకును ఢీకొట్టి దగ్ధమైన ఘటనలో 19 మంది సజీవ దహనం కావడం, బస్ డ్రైవర్ మిరియాల లక్ష్మయ్యను గత నెల 28న పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం తెలిసిందే. ఈ కేసును పత్తికొండ డిఎస్‌పి వెంకటరామయ్య దర్యాప్తు చేస్తున్నారు.



బాధితుల గోడు వింటున్న వి.శ్రీనివాసరావు

అసాధారణ విపత్తుతో సర్వం కోల్పోయారు

- తక్షణ సాయంగా రూ.5 లక్షలు ఇవ్వాలి
- రాయల చెరువు బాధితులను ఆదుకోవాలి
- ముంపు నిర్వాసితులను పరామర్శించిన వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి

రాయల చెరువు బాధితులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అసాధారణ విపత్తు వల్ల సర్వం కోల్పోయిన కుటుంబాలకు తక్షణసాయంగా రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాయలచెరువుకు గండిపడడంతో ముంపునకు గురైన తిరుపతి జిల్లా కెవిబి పురం మండలం కళత్తూరు దళితవాడలో శుక్రవారం ఆయన సిపిఎం బృందంతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ తిరిగి బాధితులను పరామర్శించారు. జరిగిన నష్టాన్ని అడిగి మిగతా 7లో

అమరావతికి రూ.7,500 కోట్ల రుణం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి నిర్మాణం కోసం రూ.7,500 కోట్లు రుణం అందింది. నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ (ఎన్‌ఎబిఎఫ్ఐడి) ఈ రుణాన్ని సిఆర్‌డిఎకు మంజూరు చేసింది. దీని ద్వారా రాజధాని నగరంలో ముఖ్యమైన నిర్మాణ పనులు చేపట్టనున్నారు. వీటికి సంబంధించిన ఒప్పంద పత్రాలను బ్యాంకు డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ సామ్యూల్ జోసఫ్ ఫైనాన్స్ విభాగ అధ్యక్షులు కె జదినేష్.. ఎపి సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ సమక్షంలో అందించారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ రాజధానిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించామని తెలిపారు. దీనిలో ముఖ్యంగా 29 గ్రామాల్లో చేపట్టాల్సిన మౌలిక సదుపాయాలపై చర్చించామని తెలిపారు. రోడ్లు, నీటి సరఫరా, మంచినీటి సదుపాయం వంటి సౌకర్యాలను మెరుగు పర్చాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.



సొరంగం నీటి పరిశీలనలో మంత్రి నిమ్మల

2026లో 'వెలిగొండ' నీరు

- యుద్ధప్రాతిపదికన పనులు
- నిర్వాసితులకు రూ.900 కోట్లకుపైగా పరిహారం ఇవ్వాల్సి ఉంది
- ప్రాజెక్టును సందర్శించిన మంత్రి నిమ్మల

ప్రజాశక్తి- పెద్దదోర్నాల (ప్రకాశం జిల్లా)

పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేసి 2026లో ఆయకట్టుకు నీరందిస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు రూ.900 కోట్లకుపైగా పరిహారం అందించాల్సి ఉందని తెలిపారు. ఇటీవల మొంథా తుపాను కారణంగా అధిక వర్షాలకు ఫీడర్ కెనాల్ 850 మీటరు వద్ద సుమారు వంద అడుగుల పొడవున 30 అడుగుల లోతులో మిగతా 2లో

గగన కల్లోలం



విమాన సర్వీసులు ఆలస్యం కావడంతో ఢిల్లీ విమానాశ్రయంలో ఎదురుచూస్తున్న ప్రయాణికులు

- ఎటిసిలో లోపంతోనే అనేక విమాన సర్వీసులు ఆలస్యం
- ఢిల్లీతో సహా దేశంలో ఇతర విమానాశ్రయాలపై ప్రభావం
- తీవ్ర ఆవస్థలు పడ్డ ప్రయాణికులు

న్యూఢిల్లీ : గగనంలో కల్లోలం చోటుచేసుకుంది. ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఎటిసి) వ్యవస్థలో తలెత్తిన సాంకేతిక సమస్యతో అనేక విమాన సర్వీసులు ఆలస్యమయ్యాయి. దీని ప్రభావంతో దేశవ్యాప్తంగా విమానాల రాకపోకల్లో జాప్యం చోటుచేసుకుంది. అనేక విమానాలకు ఎయిర్‌పోర్టుల్లో ల్యాండింగ్‌కు అనుమతి ఇవ్వలేదు. దీంతో గంటల తరబడి విమానాలు గాల్లోనే తిరగాల్సి వచ్చింది. ఫలితంగా ప్రయాణికులు, వారి బంధువుల్లో తీవ్ర స్థాయిలో ఆందోళన నెలకొంది. దేశరాజధాని ఢిల్లీతో ప్రారంభించి, ఒకదాని తరువాత ఒకటిగా అనేక ఎయిర్‌పోర్టుల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రయాణీకులు గంటల కొద్దీ తీవ్ర ఆవస్థలు పడ్డారు. ఢిల్లీలో ఉదయం 5 గంటలకే సాంకేతిక సమస్య తలెత్తింది. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ డేటాను సపోర్ట్ చేసే ఆటోమేటిక్ స్విచింగ్ (ఎఎంఎస్ఎస్)లో సాంకేతిక లోపంతో విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎఎంఎస్ఎస్ లోపంతో విమానా సర్వీసులకు అనుమతులు ఆటోమెటిక్‌గా అందడం లేదు. దీంతో ఎటిసి సిబ్బంది మ్యానువల్‌గా విమానాల షెడ్యూల్‌ను సిద్ధం చేయాల్సి వచ్చింది. ఇందులో ఆలస్యంతో విమానాశ్రయాల్లో ల్యాండ్ కావడానికి అనుమతులు రాకపోకడంతో విమానాలు కొన్ని గంటలపాటు గాల్లోనే చక్కర్లు కొట్టాయి. మరోవైపు విమానాశ్రయంలో ఎదురుచూస్తున్న ప్రయాణికులకు ఎలాంటి సమాచారం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. క్యూలైన్లలో ఎదురుచూస్తూ ఉండిపోయారు. ఇదే పరిస్థితి దేశంలోని ఇతర విమానాశ్రయాల్లోనూ ఎదుర్కొన్నారు.

ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్(డిఐఎల్) నిర్వహిస్తున్న ఢిల్లీ విమానాశ్రయం దేశంలోనే అత్యంత రద్దీ విమానాశ్రయం. సాధారణంగా గంటకు సగటున 63 సర్వీసులు నిర్వహిస్తారు. అంటే రోజుకు సుమారు 1500 సర్వీసులు ఉంటాయి. ఆలస్యంపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎయిర్‌పోర్టులోని చెక్‌ఇన్, ఇతర కౌంటర్ల వద్ద భారీ రద్దీ నెలకొంది.

ఢిల్లీ విమానాశ్రయంలో తలెత్తిన సమస్య ప్రభావం దేశంలోని ఇతర విమానాశ్రయాలపై కూడా పడింది. ముంబయి, లక్నో, జైపూర్, చండీగఢ్, అమృత్‌సర్, చెన్నై, హైదరాబాద్ ఎయిర్‌పోర్టుల్లోనూ విమానాల రాకపోకలకు అంతరాయం మిగతా 7లో

సోషలిజమే అసలైన ప్రత్యామ్నాయం



విశాఖ నగరంలో కార్మిక ప్రదర్శన

- పెట్టుబడిదారీ విధానంలో సమస్యలు పరిష్కారం కావు
- అక్టోబర్ విప్లవ దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అరుణపతాకాలు ఎగురవేత


తిరుపతిలో నిర్వహించిన సదస్సులో ప్రసంగిస్తున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - యంత్రాంగం

అసలైన అభివృద్ధి కాముకులు కమ్యూనిస్టులేనని, సోషలిజమే అసలైన ప్రత్యామ్నాయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. రష్యాలో దున్నేవానికే భూమి, పరిశ్రమలపై కార్మికులకు హక్కు, విద్య, వైద్యం, ఉద్యోగాల కల్పన, ఆహారభద్రత సైతం సోషలిస్టు ప్రభుత్వం బాధ్యతగా అందించిందన్నారు. కమ్యూనిస్టులకు 'పాలన' చేయడం రాదని ఎద్దేవా చేసిన పెట్టుబడిదారుల ముఖ్యుని వేలేసుకునేలా అందరికీ ఉపాధి కల్పించి 1934లో ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ మూసివేసేలా పాలన సాగించిందని వివరించారు. అక్టోబర్ విప్లవ వార్షికోత్సవం సందర్భంగా 'సోషలిజం- మానవ వికాసం' అంశంపై తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో సదస్సు జరిగింది. వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ... 'వన్ విజన్.. వన్ డైరెక్షన్' అన్నదే తమ ప్రభుత్వ విధానమని, దానికి అనుగుణంగా అధికార యంత్రాంగం పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పడం పూర్తిగా అసంబద్ధమని, పెట్టుబడిదారీ వ్యవస్థలో 'వన్ డైరెక్షన్' పనిచేయదని అన్నారు. చంద్రబాబునాయుడు విజన్ కంటే ముందే పుచ్చలపల్లి సుందరయ్య 1946లో దేశానికి స్వాతంత్య్రం రాక ముందే 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' పేరుతో విజన్‌ను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. 'శక్తి కొద్ది పని.. పనిని బట్టి ఫలితం' సోషలిస్ట్ వ్యవస్థ నినాదమన్నారు. అమెరికాలో 63 శాతం యువత సోషలిస్టు ఆలోచనల వైపు మొగ్గుచూపుతున్నారు, ఇది ఆ పరిణామమన్నారు. విశాఖలో గూగుల్ ఏర్పాటుతో లక్షా 60 వేల మందికి ఉద్యోగావకాశాలని విద్యాశాఖ మంత్రి అబద్ధాలు చెబుతున్నారని, వాస్తవానికి పదివేల మందికి కూడా ఉద్యోగాలు రావన్నారు.

'సోషలిజం ఔన్నత్యం - సామ్రాజ్యవాదుల దోపిడీ' అనే అంశంపై శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండల కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ మాట్లాడుతూ... అన్ని సమస్యలకు సోషలిజమే పరిష్కారమని, మహోత్తరమైన అక్టోబర్ విప్లవం ప్రపంచ గమనాన్ని మార్చివేసిందని అన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో విశాఖలో సరస్వతి పార్కు నుంచి డాబా గార్డెన్స్, అంబేద్కర్ విగ్రహం, ఆర్‌టిసి కాంప్లెక్స్ మీదుగా సెంట్రల్ పార్క్ వరకు భారీ ప్రదర్శన జరిగింది. ఎర్ర షర్టులు, ఎర్ర చీరలు ధరించి కార్మికులు పాల్గొన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ... దేశంలో ఆకలి, పేదరికం, నిరుద్యోగం లేని సమాజాన్ని సాధించడం కోసం, సోషలిజం స్థాపనకు ప్రతి ఒక్కరూ అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన సదస్సులో సిపిఎం రాష్ట్ర నేత మంతెన సీతారాం మాట్లాడుతూ...దోపిడీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం సోషలిజం అని, దీని సాధనకు విప్లవ స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా బుట్టాయగూడెంలో సభలో రాష్ట్ర కమిటీ సభ్యులు మొడియం నాగమణి హాజరయ్యారు.

నెల్లూరులో జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సదస్సులో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ... వలస విముక్తి ఉద్యమాలు జరిగే ప్రపంచంలో అనేక దేశాలు స్వాతంత్య్రం పొందాయని, అనేక దేశాలలో సోషలిస్టు వామపక్ష ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని తెలిపారు. మన దేశంలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన కమ్యూనిస్టులు నిలబడి పోరాడుతున్నారని చెప్పారు. విజయనగరంలోని జిల్లా కేంద్రంలో ఎల్‌బిజి భవనంలో లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రకాశం జిల్లా, సంతనూతలపాడు మండలం, పేర్నమిట్టలో, ఒంగోలులో సిపిఎం జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి కర్నూలులో ప్రదర్శన, సదస్సులు నిర్వహించారు.

దేశం మొత్తాన్ని ఏకం చేసే నినాదం 'వందేమాతరం'

- సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కోట్లాది మంది భారతీయుల్ని ఏకం చేసే నినాదం వందేమాతరమని సిఎం చంద్రబాబు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. వందేమాతరం గేయం యావత్ భారత్ సంస్కృతి, సంప్రదాయాలకు, భౌగోళిక స్వరూపానికి ప్రతీక అని, 150 ఏళ్ల పూర్తి చేసుకున్న ఈ గేయాన్ని నిత్యం మననం చేసుకుంటూ భిన్నత్వంలో ఏకత్వం ఉందని నిరూపిద్దామన్నారు. ప్రధాని మోదీ నిర్దేశించినట్టు అందరూ 150 ఏళ్ల వందేమాతరం గేయం ఉత్సవాలను నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు.

త్వరలో జిఆర్ఆర్ఎంఎస్

- గ్రామీణ రోడ్ల స్థితి తెలుసుకునే అవకాశం
- సమీక్షలో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామీణ రోడ్ల పూర్తి సమాచారాన్ని 'జియో రూరల్ రోడ్ మేనేజ్‌మెంట్ సిస్టం జిఆర్ఆర్ఎంఎస్'తో ప్రతిఒక్కరూ తెలుసుకునే సాంకేతికతను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. సాస్కి నిధుల సాయంతో పల్లెపండగ 2.0ను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో వివిధ పథకాలపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. నిధులు అందుబాటులో ఉన్నా పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అడవితల్లి బాట, జల్ జీవన్ మిషన్ పనులు వేగవంతంగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామీణ రహదారులన్నింటినీ జియో రూరల్ మేనేజ్‌మెంట్ సిస్టంకు అనుసంధానించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుని, రహదారులను మెరుగుపర్చుకునేలా ఈ సాంకేతికత ఉండాలన్నారు. రెండు రోజుల్లో ఇందుకు సంబంధించి స్పష్టమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం కావాలని సూచించారు. అడవితల్లి బాటను పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకుని ఈ విధానానికి అనుసంధానించాలన్నారు. అడవితల్లి బాట పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదన్నారు. ఇందుకు నిధులు రూ.1,158 కోట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 761 గిరిజన గ్రామాలను అనుసంధానిస్తూ 662 రహదారులు నిర్మించాలన్న సకల్పంతో పనులు ప్రారంభించినట్లు చెప్పారు. పల్లె పండగ 2.0 కోసం సాస్కి నిధులు వినియోగించుకోవడంలో ఆర్థికశాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు. రూ.2,123 కోట్ల నిధులతో పల్లెల్లో 4,007 కిలోమీటర్ల మేర రహదారులు, గోకులాలు, మ్యాజికల్ డ్రైన్లు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని ఉప ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ముఖ్య కార్యదర్శి, కమిషనర్లు ఈ ప్రక్రియను పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. ప్రస్తుతం చిత్తూరు, ప్రకాశం, పల్నాడు, ఉభయగోదావరి జిల్లాల్లో నిర్మాణంలో జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టుల్లో నాణ్యతా ప్రమాణాలు పక్కాగా అమలు చేయాలని, నీటి నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. 17వ తేదీ అనంతరం క్షేత్ర స్థాయిలో పర్యటించి జల్ జీవన్ మిషన్ పనుల్లో పురోగతి, ఇప్పటికే ప్రజలకు అందుబాటులో ఉన్న నీటి సరఫరా వ్యవస్థల వద్ద నీటి నాణ్యతను స్వయంగా పరిశీలన చేయనున్నట్లు చెప్పారు. మార్చి నాటికి కోటి మందికి స్వమిత్వ యాజమాన్య హక్కు పత్రాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పథకం మొదటి విడతలో 613 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి 5.18 లక్షల మందికి యాజమాన్య పత్రాలు అందించేందుకు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో పిఆర్ అండ్ ఆర్‌డి ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణతేజ, సర్వే విభాగం కార్యదర్శి కూర్మనాథ్, పిఆర్ ఇఎన్‌షి బాలూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఎమర్జెన్సీ వాతావరణం

- వైసిపి లీగల్‌సెల్ అధ్యక్షులు మనోహర్‌రెడ్డి, సుధాకర్‌బాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎమర్జెన్సీ వాతావరణం నడుస్తోందని, భావ ప్రకటన, పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తున్నారని వైసిపి లీగల్‌సెల్ అధ్యక్షులు మనోహర్‌రెడ్డి ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కర్నూలు బస్సు ప్రమాదంపై ప్రశ్నించిన 27 మందిపై కేసు పెట్టారని, పత్రికల క్లిప్పింగులు సోషల్ మీడియాలో పోస్టు చేసినందుకే నోటీసులిచ్చారని ఆయన తెలిపారు. తండ్రి ఆఖరి చూపుకోసం వచ్చిన ఎన్‌ఆర్‌ఐని కూడా వదల్లేదని, పోలీసులను కొట్టాడని అక్రమ కేసు పెట్టి కాళ్లువాచిపోయేలా కొట్టారని అన్నారు. టిడిపి వారు చేసిన నేరాల్లో వైసిపి వారిని అక్రమంగా ఇరికిస్తున్నారని అన్నారు. రాజకీయ నాయకుల సూచనలతోనే పోలీసులు ఆర్గనైజ్డ్ నేరాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కర్నూలు బస్సు ప్రమాదం జరిగి అందులో 19 మంది మరణిస్తే దానికి కారణాలు తెలుసుకోకుండా వైసిపి కేంద్ర కార్యాలయానికి వచ్చి పార్టీ మీడియా వ్యవహారాలు చూసే పూడి శ్రీహరికి నోటీసులిచ్చి వెళ్లారని తెలిపారు. ఈ కేసుతో ఏం సబంధం ఉందని శ్రీహరికి నోటీసులిచ్చారో పోలీసులు స్పష్టం చేయాలన్నారు. ఇదే అంశంపై ఎస్‌సి సెల్ నాయకులు టిజెఆర్ సుధాకర్‌బాబు కూడా మాట్లాడారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ఆందోళన

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టాలని వైసిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, పార్లమెంటు నియోజకవర్గాల పరిశీలకులు, ప్రధాన కార్యదర్శులు, ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులతో టెలీకాన్ఫరెన్స్‌ను శుక్రవారం నిర్వహించారు. పార్టీ కమిటీలు, డేటా డిజిటలైజేషన్‌పై ప్రతి ఒక్కరూ సీరియస్‌గా దృష్టిపెట్టాలన్నారు. పార్టీ కార్యక్రమాలను సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

2026లో 'వెలిగొండ' నీరు

మొదటిపేజి తరువాయి

పడిన గండిని నిపుణుల బృందంతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. జంట సొరంగాల్లోకి తొమ్మిది కిలోమీటర్ల మేర చొచ్చుకొచ్చిన వరద నీటిని తొలగించే పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో కూడా వచ్చే వరదలను దృష్టిలో పెట్టుకుని ఫీడర్ కెనాల్ సిసి వాల్ లైనింగ్ నిర్మాణంలో డిజైన్ అప్రూవల్ చేయాలని వారికి సూచించారు. అనంతరం వెలిగొండ క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ప్రాజెక్ట్ పెండింగ్ పనులపై అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 30 ఏళ్ల క్రితం ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఇప్పటికీ పూర్తి కాకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టిస్తున్నామన్నారు. వెలిగొండలో భాగమైన టన్నెల్-2లో ఇంకా 4.2 కిలోమీటర్ల లైనింగ్, బెంచింగ్ పనులు చేయాల్సి ఉందని, టిబిఎం మెషిన్ తొలగించాల్సి ఉందని తెలిపారు. ఫీడర్ కెనాల్ లైనింగ్ నిర్మాణంతోపాటు మూడు కిలోమీటర్ల పొడవున రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు ఇటీవల రూ.456 కోట్లతో టెండర్లు పిలిచామన్నారు. ఈ నెలలో ఫీడర్ కెనాల్ పనులు మొదలు పెట్టబోతున్నామని, టన్నెల్-2లో టిబిఎం మెషిన్ తొలగించడానికి సాంకేతిక నిపుణుల కమిటీని నియమించామని తెలిపారు. మంత్రి వెంట మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, అధికారులు ఉన్నారు.

ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రూ.20 లక్షలకు పెంచాలి -మంత్రికి సిపిఎం వినతి

వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రూ.10.50 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచి వెంటనే పరిహారం చెల్లించాలని, కట్ ఆఫ్ తేదీని ఎత్తివేసి, వెలిగొండ నీటిని విడుదల చేసే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని మంత్రి నిమ్మల రామానాయుడుని సిపిఎం నాయకులు కోరారు. వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించేందుకు వచ్చిన ఆయనను సిపిఎం ప్రతినిధి బృందం కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేసింది. మార్కాపురం మండలం వేములకోట, పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు సమీపాల్లో జరుగుతున్న గుండంచర్ల, గొట్టిపడియ గ్రామాల పునరావాస కాలనీల నిర్మాణాలను వేగవంతం చేయాలని, ఈ పనుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని నాయకులు కోరారు. వెలిగొండ ప్రాజెక్టు రెండో సొరంగంలో జరుగుతున్న నాసిరకం పనులపై అత్యున్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేసి నాణ్యత ప్రమాణాలు పాటించేలా రెండో సొరంగం పనులు చేయాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దగ్గుపాటి సోమయ్య, సిపిఎం దోర్నాల మండల నాయకులు దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి, పెద్దారవీడు మండల నాయకులు దొడ్డా సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనాలో ఒడిసి యువకుడి నిర్బంధం

- విముక్తి కల్పించాలంటూ వేడుకోలు

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు


చంద్రకుమార్‌రెడ్డి

జిఎంఆర్ యాజమాన్యం తనపై తప్పుడు కేసు పెట్టి నిర్బంధించిందని బతుకు తెరువు కోసం వలస వెళ్లిన శ్రీసత్యసాయి జిల్లా ఓబుళదేవరచెరువు మండలం వణుకువారి పల్లి గ్రామానికి చెందిన చంద్రకుమార్ సెల్ఫీ వీడియోలో వాపోయారు. తనకు విముక్తి కల్పించాలంటూ వేడుకుంటున్నారు. ఆఫ్రికాలోని ఘనా దేశంలో జిఎంఆర్ ఇండస్ట్రీలో సేల్స్ మేనేజర్‌గా చంద్రకుమార్ రెడ్డి చేరారు. కంపెనీ డబ్బులను వాడుకున్నాడన్న నెపంతో యాజమాన్యం అనేక ఇబ్బందులకు గురిచేసి, తనతోనే రూ. ఐదు లక్షలు కట్టించుకుందని వాపోయారు. మూడురోజుల క్రితం స్టాక్ దొంగతనం చేసినట్లు పోలీసులకు యాజమాన్యం ఫిర్యాదు చేసి తనను నిర్బంధించిందన్నారు. యాజమాన్య వేధింపుల నుంచి ఎలాగైనా కాపాడాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

కమ్యూనిజానికి సానుకూల పవనాలు

- సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిజానికి సానుకూల పవనాలు వీస్తున్నాయని, అమెరికాలోని న్యూయార్క్‌లో సైతం సోషలిస్టు జోహ్రాన్ మమ్దాని మేయర్‌గా విజయం సాధించారని సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. విజయవాడలోని దాసరి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1917లో అక్టోబరు మహా విప్లవంతో నవంబరు 7న రష్యాలో మొట్టమొదటి శ్రామిక రాజ్యం ఏర్పడిందన్నారు. ఈ విప్లవ స్ఫూర్తితో కమ్యూనిస్టులు పునరేకీకరణ కావాలని, ఆ దిశగా దేశంలో నూతన శక్తిని తీసుకురావాలని అన్నారు.

అమెరికాలో ట్రంప్ మాటలు సైతం లెక్కచేయకుండా ప్రజలు డెమొక్రటిక్ అభ్యర్థికి ఓట్లు వేశారని చెప్పారు. నేపాల్‌లో 9 కమ్యూనిస్టు పార్టీలు ఐక్యతతో ముందుకు రావడం మంచి పరిణామమని పేర్కొన్నారు. మావోయిస్టులతో చర్చలు చేపట్టేందుకు కేంద్రం ముందుకు రావాలని కోరారు. దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులకు వ్యతిరేకంగా, అలాగే జనగణనలో కులగణన చేపట్టాలన్న డిమాండ్‌తో ఈ నెల 18న దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి దుర్గాభవాని, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీచరణికి రూ.2.5 కోట్ల ప్రోత్సాహకం

- గ్రూప్ 1 ఉద్యోగం, ఇంటి స్థలం కూడా
- ముఖ్యమంత్రితో మర్యాదపూర్వక భేటీ
- స్వాగతం పలికిన లోకేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో / మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

మహిళా క్రికెట్ వరల్డ్ కప్ విజేత, టీమిండియా సభ్యురాలైన శ్రీచరణి, ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారిణికి భారీ నజరానా ప్రకటించారు. రూ.2.5 కోట్ల నగదు, కడపలో 1000 చదరపు అడుగుల స్థలం, రాష్ట్ర ప్రభుత్వంలో గ్రూప్-1 అధికారిగా ఉద్యోగం కూడా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఉమెన్ వరల్డ్ కప్ గెలుచుకున్న ఆనంద క్షణాలను ముఖ్యమంత్రితో పాటు ఐటిశాఖ మంత్రి నారా లోకేష్‌తో పంచుకున్నారు. విజేతగా నిలవడం ద్వారా భారతదేశ మహిళల సత్తా చాటారని, మహిళా క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారంటూ ఆమెను చంద్రబాబు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు భారత జట్టుకు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆమెను శాలువాతో సత్కరించారు. క్రీడాకారిణి శ్రీచరణి ఈ సందర్భంగా మహిళా క్రికెటర్లు సంతకాలు చేసిన టీషర్ట్‌ను అందించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలిరాజ్ ఉన్నారు. అంతకముందు ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయానికి చేరుకున్న ఆమెకు నారా లోకేష్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. తొలుత గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకోగానే ఆమెకు రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, సవిత, సంధ్యారాణి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.


ముఖ్యమంత్రితో కలిసి శ్రీచరణి,మిథాలిరాజ్‌లో మంత్రి లోకేష్ సెల్ఫీ

సమస్యలు ఎదుర్కొని నిలిచాం.. కప్పు గెలిచాం..

ప్రపంచ కప్ ఫైనల్ ఆడాలనే సంకల్పంతో జట్టు మొత్తం ప్రయత్నించిందని, చాలా సమస్యలు ఎదుర్కొని నిలిచామని, కప్పు సాధించామని భారత మహిళా క్రీడాకారిణి శ్రీచరణి తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నవులూరులోని ఎసిఎ క్రికెట్ స్టేడియంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఆడపిల్లల క్రికెట్ పట్ల ఇప్పుడు తల్లిదండ్రుల దృక్పథంలో మార్పు వచ్చిందని, చాలా మంది తనకు ఫోన్ చేసి తమ అమ్మాయిలు క్రికెట్ కెరీర్‌ను ఎలా మొదలు పెట్టాలో అడుగుతున్నారని చెప్పారు. ఇండియా ఉమెన్స్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్ కష్టం, వారి అనుభవం తమకెంతో ఉపయోగపడిందని పేర్కొన్నారు. తమకు మద్దతు తెలిపిన సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన క్రికెట్ జీవితంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రోత్సాహం మరువలేనిదన్నారు. ఎసిఎలో శిక్షణ తీసుకున్న తాను ప్రొఫెషనల్ క్రికెట్ ఆడటం మొదలుపెట్టిన ఐదేళ్ల తర్వాత భారత జట్టులో స్థానం దక్కిందని తెలిపారు. అనంతరం కడపకు చేరుకున్న శ్రీచరణిని ఘనంగా సన్మానించారు.

త్వరలోనే మహిళా క్రికెట్ అకాడమీ : శివనాథ్

ఎసిఎ ప్రెసిడెంట్ శివనాథ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో రాబోయే మహిళా క్రికెటర్లకు శ్రీచరణి ఆదర్శమన్నారు. ఎసిఎ తరపున త్వరలో మహిళా క్రికెట్ అకాడమీ ప్రారంభించబోతున్నట్లు ప్రకటించారు. ఎసిఎ తరపున మహిళా క్రీడాకారులను ప్రోత్సహించేలా వైజాగ్‌లో మిథాలీ రాజ్ పేరుతో ఒక స్టాండ్ ప్రారంభించామని చెప్పారు.

ఎమ్మెస్కే ప్రసాద్‌కు అవమానం!

టీమిండియా మాజీ చీఫ్ సెలెక్టర్, ఎమ్మెస్కే ప్రసాద్‌కు ఘోర అవమానం జరిగింది. ప్రపంచకప్ విన్నర్, తెలుగు తేజం శ్రీచరణికి ఘన స్వాగతం పలికేందుకు గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన ఎమ్మెస్కే ప్రసాద్‌ను సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు.

ఈ వ్యవహారంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఎమ్మెస్కే ప్రసాద్ ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. మాజీ క్రికెటర్, చీఫ్ సెలెక్టర్‌గా తనకు ప్రొటోకాల్ ఇవ్వకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెస్కే ప్రసాద్.. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) ప్రతినిధులపై కూడా బిసిసిఐకి ఫిర్యాదు చేసే యోచనలో ఉన్నారు.

సిఎం చంద్రబాబు సీరియస్

ఈ ఘటనపై ఎమ్మెస్కే ప్రసాద్‌తో మాట్లాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రొటోకాల్ విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోవడంపై ఎసిఎ సెక్రటరీ సానా సతీష్‌పై అసహనం వ్యక్తం చేశారు. మరోసారి ఇలాంటి తప్పిదాలు జరగకుండా చూసుకోవాలని ఎసిఎకు సిఎం ఆదేశించారు.

'నా తల్లిదండ్రులను అవమానిస్తే వదిలిపెడతానా..?

- మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

అసెంబ్లీ సాక్షిగా నా తల్లిని అవమానించిన వారిని, అక్రమ కేసులో తన తండ్రిని ఇరికించి 58 రోజులు జైలులో పెట్టినవారిని వదిలే ప్రసక్తేలేదని మంత్రి లోకేష్ అన్నారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కార్యకర్తల కష్టం, సీనియర్ల త్యాగాలతోనే టిడిపి ఎదిగిందన్నారు. కార్యకర్తలే పార్టీ అధినేతలని పునరుద్ఘాటించారు. కార్యకర్తల సంక్షేమం కోసం రూ.135 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. అహంకారమనే పదాన్ని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తొలగించుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం సహకారం, అన్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అండతో రాష్ట్రాభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు చూసి కర్ణాటక రాష్ట్రం షేక్ అవుతోందని వ్యాఖ్యానించారు. నాయకులు, కార్యకర్తలు ఎవ్వరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని టిడిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి భరత్, ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో నేడు, రేపు ఆశాల రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి- అనకాపల్లి

ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఐదో రాష్ట్ర మహాసభకు అనకాపల్లి సిద్ధమైంది. గవరపాలెంలోని కర్రి రమేష్ మెమోరియల్ హాలు (నాగలక్ష్మి నగర్)లో శని, ఆదివారాల్లో జరిగే ఈ మహాసభకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి చేయాల్సిన పోరాటాలు, నిర్మాణ కర్తవ్యాలు, తక్షణ కర్తవ్యాలపై చర్చలు, తీర్మానాలు చేయనున్నారు. ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి 20 ఏళ్లుగా ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ పోరాటాలు నిర్వహిస్తోంది. ఉద్యమాల నేపథ్యంలో ఇప్పటికే పలు సమస్యలు పరిష్కారమయ్యాయి.

ఆశాలతో అదనపు పనులు చేయించరాదని, సమస్యల పరిష్కారానికి మూడు నెలలకు ఒకసారి అధికారులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు, రికార్డులు రాయించరాదనే సర్క్యులర్లు వెలువడ్డాయి. ఇన్సూరెన్స్, పిఎంజెజెబివై, పిఎంఎస్‌బివై-2025 జూన్ నుండి అమలు సర్క్యులర్, వయోపరిమితి 60 నుంచి 62 ఏళ్లకు పెంపు జిఒ, వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవుల జిఒ, గ్రాట్యూటీ అమలు జిఒ, రూ.10 వేల ఫిక్స్‌డ్ గౌరవ వేతనం జిఒ, దహన సంస్కారాల ఖర్చు ఇవ్వడం వంటివి అమల్లోకి వచ్చాయి.

కార్మికుల సమస్యలపై జరిగిన పలు పోరాటాల్లోనూ ఆశాలు సంఘీభావంగా పాల్గొని ఐక్యత చాటారు. ఆశాలను నేటికీ పలు సమస్యలు వేధిస్తున్నాయి. వాటి పరిష్కారానికి, సంఘ బలోపేతానికి ఈ మహాసభలో కీలక నిర్ణయాలు చేయనున్నారు. 2026 ఫిబ్రవరి, మార్చి నెలల్లో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా చలో విజయవాడ కార్యక్రమంపైనా చర్చించనున్నారు.

ఆశాల సమస్యలపై చర్చించి, నిర్ణయాలు చేస్తాం

రెండు రోజులపాటు అనకాపల్లిలో జరగనున్న మహాసభలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, ఆశాల సమస్యలపై చర్చించనున్నాం. పరిష్కార మార్గాలను కనుగొంటాం. సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం.

కె.ధనలక్ష్మి, ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు)

సోషలిజానిదే భవిత

మొదటిపేజి తరువాయి

సాగిస్తున్న ట్రంప్ విధానాలపై అమెరికాలోని 200 పట్టణాల్లో నిరసన ప్రదర్శనలు భారీ ఎత్తున జరిగాయని తెలిపారు. పపంచ సంపదను దోచుకుని అమెరికాలో పెట్టడం తప్ప అక్కడ ప్రజలకు పెట్టుబడిదారీ విధానం చేస్తున్నదేమీ లేదని అర్థం అయిందన్నారు. దీంతో అక్కడి యువతలో సోషలిజం వైపు మొగ్గు పెరుగుతోందని తేలిందన్నారు. గత 40 రోజుల నుండి అమెరికాలో పాలన నిలిచిపోయిందని, వేతనాలు చెల్లించకపోవడంతో ప్రజలు రోడ్లపైకి వచ్చి ఉద్యమాలు చేస్తున్నారని అన్నారు. అమెరికాలో ఇటీవల జరిగిన అన్ని ఎన్నికల్లోనూ ట్రంప్ ఓడిపోతున్నారని, రాజరికం వద్దనే ప్రదర్శనలు అందులో భాగమేనని తెలిపారు. రష్యాలో సోషలిజం పాలన కూలిపోయిన తరువాత పెట్టుబడిదారీ విధానాన్ని భరించాల్సిందేనని ప్రజలు భావించారని అన్నారు. ఇప్పుడు వారే సోషలిజం వైపు మళ్లుతున్నారని అన్నారు. ప్రపంచంలో వ్యాపారం 40 శాతం తగ్గిందని,పెట్టుబడిదారీ విధానం క్షీణిస్తోందని చెప్పడానికి ఇదే ప్రత్యక్ష ఉదాహరణని అన్నారు. ఆ విధానం ప్రజలకు ఉపాధి కల్పించలేకపోతోందని చెప్పారు. కష్టాల పాల్జేస్తున్న పెట్టుబడిదారీ విధానాన్ని తొలగించుకోవాలనే నిర్ణయానికి ప్రపంచవ్యాప్తంగా ప్రజానీకం వస్తోందని, ఈ పరిణామాలన్నీ సోషలిజానిదే భవిష్యత్తు అని స్పష్టం చేస్తున్నాయని చెప్పారు. డాలర్ విలువ తగ్గుతోందని, ఇది అమెరికా ఆర్థిక వ్యవస్థను మరింత దెబ్బతీస్తోందని అన్నారు. మరోవైపు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు వీలుగా ప్రపంచంలో అనేక దేశాల మధ్య యుద్ధాలు జరుపుతోందని చెప్పారు. పాలస్తీనా ఇజ్రాయిల్, రష్యా, ఉక్రెయిన్, పాకిస్తాన్ భారత్ మధ్య యుద్ధాలన్నీ అమెరికా జరుపుతున్నవేనని చెప్పారు. అన్నిచోట్లా అది ఓడిపోతోందని అన్నారు. మరోవైపు కమ్యూనిస్టు దేశాలు అన్ని అంశాల్లోనూ వేగంగా ముందుకు వెళుతున్నాయని, చైనా ప్రపంచ తయారీ కేంద్రంగా మారిందని అన్నారు. అమెరికాను మించి ఉత్పత్తి చేస్తోందని తెలిపారు. వియత్నాం వంటి దేశాలు కూడా ఆర్థికంగా బలంగా ముందుకు వెళ్తున్నాయని వివరించారు. అదే సమయంలో ప్రపంచ వ్యాప్తంగా విఫలమవుతున్న పెట్టుబడిదారీ విధానం అమలు మన దేశంలో తీవ్రమౌతోందని చెప్పారు. మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత అదానీ ఆస్తి 1500 రెట్లు, అంబానీ ఆస్తి 500 రెట్లు పెరిగిందని, కానీ కార్మికుల జీతాలు పెరగడం లేదని అన్నారు. అలాగే విద్యుత్ సంస్కరణలు వేగవంతం అయ్యాయని, ఆ రంగం అదానీ చేతుల్లోకి పోతోందని, దీనివల్ల భవిష్యత్‌లో ప్రజలపై మోయలేని భారాలు పడతాయని చెప్పారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ శ్రమకు తగ్గ వేతనం, ఉఉపాధి, జీవన భద్రత కావాలంటే సోషలిజయంలోనే అది సాధ్యమని తెలిపారు. ఈ సభకు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షత వహించారు. ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, కె.శ్రీదేవి, ఎన్‌సిహెచ్.శ్రీనివాసరావు, పి.వి.ఆంజనేయులు, కె.కల్యాణ్, నాగేంద్రప్రసాదు, సిపిఎం విజయవాడ నగర పాలక సంస్థ ఫ్లోర్‌లీడర్ బి.సత్యబాబు, నాయకులు జోన్ కార్యదర్శులు బి.రమణ, కృష్ణ పాల్గొన్నారు.

భారీ ప్రదర్శన

అంతకుమందు విజయవాడ నగరంలో వేలాదిమంది రెడ్‌షర్టు వాలంటీర్లు నిర్వహించిన కవాతు ప్రజానీకాన్ని ఆకట్టుకుంది. తుమ్మలపల్లి కళాక్షేత్రం నుండి బయలుదేరిన ప్రదర్శన కంట్రోల్ రూము, పాతబస్టాండు, ఏలూరురోడ్డు, మ్యూజియం రోడ్డు మీదుగా రాఘవయ్య పార్కు వద్దనున్న మాకినేని బసవపున్నయ్య విజ్ఞాణ కేంద్రం వరకూ సాగింది.

సోషలిజం వైపు యువత దృష్టి

'పెట్టుబడిదారి విధానం, భవిష్యత్తు' అనే అంశంపై గుంటూరులో జరిగిన సభలో రాఘవులు మాట్లాడుతూ... ప్రపంచంలో చాలా దేశాల్లో పెట్టుబడిదారి వ్యవస్థ కూలిపోతుందని, ఈ దశలో యువత, విద్యార్థులు సోషలిజం వైపు దృష్టి సారిస్తున్నారని అన్నారు. సోషలిజం వస్తే కార్మికులు, కర్షకులు, పేదలకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. సభకు సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జి రంగా నేటి తరానికి ఆదర్శం

- మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆధునిక భారతదేశ శాస్త్రవిజ్ఞాన రంగాలకు దారి చూపిన మహోన్నత మేధావి, రైతు సంక్షేమం కోసం జీవితాంతం పోరాటం చేసిన వెలుగు దిక్సూచి ఆచార్య ఎన్‌జి రంగా 125వ వర్ధంతి సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు ఘనంగా నివాళులర్పించారు. ఆచార్య రంగా మేధస్సు, పరిశోధన, సేవాస్ఫూర్తి, ప్రజా సంకల్పం నేటి తరాలకు శాశ్వత ప్రేరణ అని మంత్రి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల హక్కుల కోసం రాజీ పడకుండా పోరాడిన గొప్పనాయుడైన రంగా మార్గం అనుసరించాల్సిన ధర్మమని వెల్లడించారు. శాస్త్రీయ దృష్టి, సాంకేతికత, ఆధునిక వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి అనే విలువలతో నిండిన రంగా ఆలోచనలు ఇప్పటికీ దేశానికి మార్గదర్శకాలుగా పేర్కొన్నారు.

మచిలీపట్నం-విజయవాడ డిపిఆర్‌పై సమీక్ష

- మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి

ప్రజాశకి - అమరావతి బ్యూరో

మచిలీపట్నం- విజయవాడ జాతీయ రహదారి ప్రతిపాదిత డిపిఆర్‌పై నేషనల్ హైవే అధికారులతో రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి శుక్రవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రతిపాదిత డిపిఆర్‌ల బెంజిసర్కిల్ నుంచి భవిష్యత్తులో రాబోయే ఓఆర్‌ఆర్ వరకు ఎటువంటి అండర్‌పాస్, ఫ్లై ఓవర్ల ప్రస్తావన లేక పోవడంపై మంత్రి అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానికంగా ప్రజాప్రతినిధులు, కలెక్టర్ నుంచి వచ్చిన ప్రతిపాదనను పరిశీలించాలని ఎన్‌హెచ్‌ఎ అధికారును మంత్రి ఆదేశించారు. విజయవాడ నుంచి పెనమలూరు వరకు భవిష్యత్తులో మెట్రో ఏర్పాటుకు నిర్ణయిస్తే దానిని డబుల్ డెక్కర్‌గా ప్రతిపాదించాలని ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు సూచించారు. సమావేశం ప్రారంభంలో డిపిఆర్‌పై ఎన్‌హెచ్‌ఎ విజయవాడ ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాసాగర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

స్టింగ్ మెటావర్స్ రెవెన్యూలో 165 శాతం వృద్ధి

హైదరాబాద్ : ప్రముఖ వెబ్3 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గేమింగ్ కంపెనీ స్టింగ్ మెటావర్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 165.41 శాతం వృద్ధితో రూ.233.27 కోట్ల రెవెన్యూ సాధించింది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న ఈ సంస్థ గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.87.89 కోట్ల రెవెన్యూ నమోదు చేసింది. రూ.6.75 కోట్లుగా ఉన్న కంపెనీ నికర లాభాలు గడిచిన క్యూ2లో 220 శాతం వృద్ధితో రూ.21.64 కోట్లకు చేరాయి. 2025-26 ప్రథమార్థంలో రెవెన్యూ 213 శాతం పెరిగి రూ.432 కోట్లకు, నికర లాభాలు 229.18 శాతం వృద్ధితో రూ.39.93 కోట్లకు చేరాయి.

ఆశలు ఆవిరి..!

- చుక్కనీరు లేని రాయల చెరువు
- ప్రశ్నార్థకంగా మారిన 1800 ఎకరాల ఆయకట్టు సాగు
- వన్య ప్రాణులు, మూగజీవాలకూ కటకటే


చుక్కనీరు లేని రాయలచెరువు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తిరుపతి జిల్లా కెవిబిపురంలోని రాయల చెరువు రిజర్వాయరును చూస్తే 'గుండె చెరువు..ఆశలు ఆవిరి'లా అనిపిస్తోంది. ప్రభుత్వాల అలసత్వంతో రాయల చెరువుకు, రైతుల ఆశలకు భారీగా గండిపడింది. సుమారు 20 మీటర్ల పొడవు మేర కట్ట తెగిపోవడంతో చెరువులో చుక్క నీరు లేకుండా పోయింది. బలహీనంగా మారిన కట్టను తెంచుకుని కళ్లు మూసి తెరిచే లోపు ఉప్పెనలా పొలాలు, గ్రామాలను ముంచెత్తింది. అనుకోని ఉపద్రవం మిగిల్చిన ఆస్తి నష్టం ఒకవైపు..చెరువులో నీళ్లు లేకపోవడంతో ఈ సారి ఆయకట్టు కింద పంటల సాగుకు దారిదనే అగమ్యగోచర పరిస్థితితో అన్నదాతలు ఆందోళనతో ఉన్నారు.

1800 ఎకరాల ఆయకట్టు సాగు ప్రశ్నార్థకం

ఏడు గ్రామాలకు సాగునీరందించడమే లక్ష్యంగా సుమారు 128 ఎకరాల విస్తీర్ణంలో ఓల్లూరు రిజర్వు ఫారెస్ట్ కొండల నడుమ 1956లో రాయల చెరువు రిజర్వాయరును నిర్మించారు. మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు కింద 88 ఎంసిఎఫ్టీలు (0.008 టిఎంసిలు) సామర్థ్యంతో నిర్మాణం జరిగింది. ఓల్లూరు, సదాశివపురం, రాయపేడు, సిద్ది నాయుడు కండ్రిగ, కెసి కండ్రిగ, పొన్నాలమ్మ చెరువులకు రాయల చెరువు ద్వారా నీటి సరఫరా అవుతుంది. తద్వారా ప్రతి ఏటా ప్రత్యక్షంగా 1500 ఎకరాలు, పరోక్షంగా 300 ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. రబీ, ఖరీఫ్ సీజన్లలో వరి, వేరుశనగ పంటలను ఇక్కడ రైతులు సాగు చేస్తారు. ప్రస్తుతం వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేస్తున్నారు. ఉప్పెనలా వచ్చిన నీటితో పంట పొలాలన్నీ మునిగిపోయాయి. పంట దక్కే అవకాశం లేదని, మళ్లీ సాగుచేసేందుకు చెరువులో నీరు సైతం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నఫలంగా చెరువు ఖాళీ అవడంతో ఆయకట్టుసాగు ప్రశ్నార్థకంగా మారింది.

వన్య ప్రాణులు, మూగజీవాలకూ కటకటే

రెండు పంటలకు సాగునీరు పోగా 30 శాతం నీటి నిల్వ ఉండేది. ఓల్లూరు రిజర్వు ఫారెస్ట్ పరిధిలోని పడమట అడవుల నుంచి పెద్ద ఎత్తున వన్య ప్రాణులు రిజర్వాయర్ వద్దకు వస్తుంటాయి. రిజర్వాయర్ సమీప గ్రామాల్లోని మూగజీవాలు నిత్యం దాహార్తిని తీర్చుకోవడం పరిపాటి. ఈ క్రమంలో రానున్న వేసవికాలం నేపథ్యంలో వన్యప్రాణులు, మూగ జీవాలు తాగునీటికి కటకటలాడాల్సిందే.

చెరువంత నిర్లక్ష్యం..!!

రాయల చెరువుకు గండి పడ్డ ఘటనలో అడుగడుగునా పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కనబడుతోంది. 2015లో అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో నీరు-చెట్టు పథకం కింద రూ. 25 లక్షలు ఖర్చుచేసి కాలువలు, పూడికతీత పనులు చేపట్టారే కానీ కట్ట బలోపేతానికి చర్యలు చేపట్టలేదు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సైతం తట్ట మట్టిని కట్టపై పోసిన దాఖలాలు లేవు. తెగిన చోటు లోతట్టు ప్రాంతం కావడం.. కట్ట ఎత్తు 14 మీటర్లే ఉండటం గండి పడటానికి కారణమైంది. సాధారణంగా ఆలస్యంగా నిండే రాయల చెరువు ఈ సారి ముందుగానే గరిష్ట స్థాయి నీటి నిల్వలకు చేరింది. ఈ క్రమంలో ఎక్కడిక్కడ కట్ట బలహీనంగా ఉందో..! ఎక్కడ గండ్లు పడే అవకాశాలు ఉన్నాయో..! గుర్తించడంలో అధికారులు వైఫల్యం చెందారు.

తేరుకునే లోపే

రాయల చెరువు నుంచి నీరు లీకవుతుందని గిరిజనుల ద్వారా సమాచారం అందుకున్నాం. జెసిబిలతో వెళ్లి గండిని పూడ్చే ప్రయత్నం చేసే లోపే చేయి దాటిపోయింది. కళ్ల ముందే పెద్ద శబ్దంతో నీరు బయటకు వచ్చింది. చేసేదిలేక సమీప గ్రామాల ప్రజలను హెచ్చరించాం. ప్రాణ నష్టం లేకుండా కాపాడగలిగాం. రాయలచెరువు చరిత్రలో ఇదే మొదటి ఉపద్రవం.

బాబు శెట్టి, రాయలచెరువు ఆయకట్టు చైర్మన్

మరమ్మతులు ఆలస్యం

గండి విషయంలో అధికారుల తప్పిదమేమీ లేదు. అక్టోబర్ 28, 29 తేదీల్లో ఇరిగేషన్ డిఇతో కలిసి కట్టను పరిశీలించాం. ఎక్కడా లోటుపాట్లు కనపడలేదు. ఊహించని విధంగా గండి పడింది. ప్రస్తుతం అనుకూల పరిస్థితులు లేనందున మరమ్మత్తులు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. మరోసారి వర్షాలు వస్తే నీటిని మళ్లించి ముంపు లేకుండా చర్యలు చేపడతాం.

బాబు, ఇరిగేషన్ ఎఇ

పరిస్థితి అగమ్యగోచరం

రాయలచెరువు నుండి ఓల్లూరు చెరువుకు నీళ్లొస్తేనే రెండు పంటలు పండేది. చెరువులో చుక్కనీరు లేకపోవడంతో పంటల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ప్రవీణ్, రైతు, పాతపాలెం

టూరిజం ప్రైవేటీకరణపై కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - అరకులోయ రూరల్ (అల్లూరి జిల్లా)

ఎపి టూరిజం శాఖను ప్రైవేటీకరించాలనే టిడిపి కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆ శాఖలో పనిచేస్తున్న కార్మికులు శుక్రవారం అరకులోయలో ఆందోళనకు దిగారు. ఎపి టూరిజం హరిత రిసార్ట్స్ గేటు వద్ద పెద్ద పెట్టున నినదిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి టూరిజం కాంట్రాక్ట్, మ్యాన్‌పవర్, డైలీవేజ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి గంగరాజు మాట్లాడుతూ ఐదో షెడ్యూల్ ఏరియాలో 1/70 చట్టం అమల్లో ఉండగా ఎపి టూరిజం యాజమాన్యం ప్రైవేట్ వ్యక్తులకు టూరిజాన్ని అప్పగించడం చట్ట విరుద్ధమన్నారు. అల్లూరి జిల్లాలో అనంతగిరి మండలం తైడా జంగిల్‌బెల్స్, అనంతగిరి, అరకులోయల్లోని హరిత రిసార్ట్స్, మయూరి, వంజంగి టూరిజం కేంద్రాలపై ఆధారపడి వేలాది మంది గిరిజనులు జీవనోపాధి పొందుతున్నారని, తెలిపారు. ప్రైవేటీకరణ చర్యలతో వారికి తీవ్ర నష్టం జరుగుతుందని, ఉద్యోగ భద్రత ఉండదని అన్నారు. ఎపి టూరిజం ప్రస్తుతం లాభాల్లోనే ఉందని, కొంతమంది టూరిజం అధికారులు ప్రైవేట్ వ్యక్తుల ప్రయోజనాల కోసం తప్పుడు సమాచారం అందించి ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. అరకులోయకు పర్యాటకంగా ఎంతో పేరుందని, రాష్ట్రానికి ఆదాయ వనరుగా, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణలో కీలక పాత్రధారిగా ఈ ప్రాంతం ఉందని గుర్తుచేశారు. అటువంటి ప్రాంతాన్ని ప్రైవేటుకు అప్పగించడం తగదన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, అంజలిరావు, బాబూరావు, ధర్మ, బిబి.జాను, అప్పలస్వామి, అప్పలనాయుడు, జ్యోతి, జయంతి పాల్గొన్నారు.


అరకులోయలోని హరిత రిసార్ట్స్ గేటు వద్ద నిరసన తెలుపుతున్న టూరిజం కార్మికులు

మద్యం అమ్మకాలు తగ్గాయని ప్రభుత్వం చింతించడం విడ్డూరం : ఐద్వా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మద్యం అమ్మకాలు తగ్గాయని ప్రభుత్వం చింతించడం విడ్డూరంగా ఉందని, ఎక్సైజ్‌శాఖ సమీక్షా సమావేశం మద్యం అమ్మకాలను ప్రోత్సహించేదిగా ఉందని ఐద్వా రాష్ట్ర కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై శుక్రవారం ఐద్వా అఖిల భారత సహాయ కార్యదర్శి డి రమాదేవి, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీదేవి, సావిత్రి ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశారు. ఐదు జిల్లాల్లో అమ్మకాలు తగ్గాయని, ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్లపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేయడం ఆందోళనకరమని తెలిపారు. మద్యాన్ని నియంత్రించాలని మహిళలు కోరుతుంటే దానికి విరుద్ధంగా ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయన్నారు. చౌకమద్యం, ప్రైవేటు మద్యం షాపులతోపాటు బార్లకూ లైసెన్సులు ఇచ్చి అమ్మకాలు పెంచారని విమర్శించారు. మద్యం అమ్మకాలు తగ్గడానికి ఆర్థిక పరిస్థితులు దిగజారడం కారణమనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని పేర్కొన్నారు. మద్యం వల్ల మహిళల మాన ప్రాణాలకు తీవ్ర ప్రమాదం ఏర్పడుతోందని, చిన్న పిల్లలపై, మహిళలపై దాడులు, అత్యాచారాలు రాష్ట్రంలో పెరిగిపోతున్నాయని ఆగ్రహించారు. ప్రజల జీవితాలను, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని మద్యాన్ని నియంత్రించాలని వారు కోరారు.

ఎపిఐఐసికి 15 మంది డైరెక్టర్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక వనరుల సంస్థకు కొత్తగా 15 మందిని డైరెక్టర్లుగా నియమిస్తూ పరిశ్రమలశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కొండా భాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, చల్లా లక్ష్మీ ప్రసాద్, చెన్నమల్ల చంద్రశేఖర్, దోమా జగదీష్‌గుప్తా, గొల్లపూడి పెద్దిరాజు, కద్లి గోపాలరావు, జి ప్రేమ్‌కుమార్, కంచర్ల మాధవి, కనికళ్ల చిరంజీవి, మండలి రాజేష్, పాతూరి నారాయణస్వామి మహేష్, ప్రసాద్‌రెడ్డి, వంగూరు సంతోష్‌కుమార్, మార్గాని సత్యనారాయణ్‌ను నియమించారు.

గుంటూరులో 10, 11 తేదీల్లో వాటర్ షెడ్ కాన్ఫరెన్స్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఈ నెల 10, 11 తేదీల్లో గుంటూరులో నేషనల్ వాటర్ షెడ్ కాన్ఫరెన్స్‌ను కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ పరిధిలోని భూ వనరుల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించనున్నాయి. శుక్రవారం గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ప్రకటన విడుదల చేసింది. ఈ సమావేశంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన (పిఎంకెఎస్‌వై) 2.0 వాటర్‌షెడ్ అభివృద్ధి భాగం అమలు పురోగతిని సమీక్షిస్తారు. చింతన్-2026 నుంచి భవిష్యత్తులో అమలు చేయబోయే వాటర్‌షెడ్ అభివృద్ధి పథకం విధానంపై వివిధ భాగస్వామ్య పక్షాలతో సమీక్షించడం, అవగాహన, ప్రజల భాగస్వామ్యం పెంచడానికి 'వాటర్‌షెడ్ మహోత్సవ్' ప్రారంభించనున్నారు. ఈ కాన్ఫరెన్స్‌కు కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, రైతు సంక్షేమశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, నోడల్ మంత్రి పవన్‌కల్యాణ్ హాజరవుతారు. విధాన నిర్ణేతలు, మంత్రిత్వ శాఖలు/విభాగాల ప్రతినిధులు, పరిశోధనా సంస్థల శాస్త్రవేత్తలు, ప్రఖ్యాత స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రెండు రోజుల సమావేశంలో పాల్గొంటారని భావిస్తున్నారు.

ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ నుంచి కొత్త ఫండ్

ముంబయి : తమ సంస్థ కొత్తగా బిఎస్‌ఇ 500 ఎన్‌హాన్స్‌డ్ వాల్యూ 50 ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించిందని ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ తెలిపింది. ఇది ఆదాయాలు, పుస్తక విలువ , ధరకు సంబంధించి అమ్మకాలు వంటి విలువ ఆధారిత పెట్టుబడి ప్రమాణాలపై ఎంపిక చేయబడిన 50 కంపెనీలను కలిగి ఉంటుందని పేర్కొంది. "ఈ ఫండ్ మా యులిప్ కస్టమర్లకు భారతదేశ వృద్ధి కథలో పాల్గొనడానికి సరళమైన, పారదర్శకమైన మార్గాన్ని అందిస్తుంది. ఇది వారికి సంపదను నిర్మించడానికి దీర్ఘకాలిక విలువ పెట్టుబడిని అందిస్తుంది.' అని ఆ సంస్థ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ మనీష్ కుమార్ పేర్కొన్నారు.

భూ సేకరణ పేరుతో రైతులకు అన్యాయం : వ్యకాసం

ప్రజాశక్తి - గుత్తి (అనంతపురం జిల్లా)

సోలార్ ప్రాజెక్టు కోసం భూసేకరణ పేరుతో రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కొని వారిని అన్యాయం చేస్తున్నారని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు విమర్శించారు. సోలార్ ప్రాజెక్టు కోసం రెన్యూ కంపెనీ భూసేకరణ చేస్తున్న అనంతపురం జిల్లా గుత్తి పరిధిలోని బేతాపల్లి, ధర్మాపురం, బాచుపల్లి, కరిడికొండ, ఊటకల్లు గ్రామాల్లో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శుక్రవారం పర్యటించారు.

ఈ సందర్భంగా రైతులు, వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దడాల సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం కృష్ణమూర్తి మాట్లాడారు. తమకు తెలియకుండానే సోలార్ ప్రాజెక్టుకు ఇచ్చేశామని అందువల్ల తాము పూర్తిగా నష్టపోతున్నామని ప్రస్తుతం తెలుస్తోందని కొంతమంది రైతులు వాపోతున్నారన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు కొంతమందిని బలవంతంగా భూములు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడుతున్నారని రైతులు చెబుతున్నారని తెలిపారు. సోలార్ యజమానులు కూడా ముందుగా భూమి చుట్టుపక్కల కొనుగోలు చేసి మధ్యలో ఉన్న రైతులను బెదిరించి బలవంతంగా భూసేకరణ చేయడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. 2013 భూ సేకరణ చట్టం పైన జిల్లా కలెక్టర్‌తోపాటు రెవెన్యూ అధికారులు భూసేకరణ జరుగుతున్న గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. లేనిపక్షంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా అధ్యక్షుడు సూరి, ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, సహాయ కార్యదర్శి భాస్కర్, సిఐటియు మండల కార్యదర్శి వి నిర్మల తదితరులు పాల్గొన్నారు.


పొలాల్లో రైతులతో మాట్లాడుతున్న వ్యకాసం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు



ధర్నా చేస్తున్న చేనేత కార్మికులు

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే చలో అసెంబ్లీ

ప్రజాశక్తి-గుంటూరు

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడతామని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కట్టా శివదుర్గారావు హెచ్చరించారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరులోని చేనేత జౌళిశాఖ ఎడి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత ప్రధాన వృత్తిగా ప్రసిద్ధి చెందిన చేనేత పరిశ్రమ ప్రభుత్వాలు కార్పొరేట్ విధానాల వల్ల సంక్షోభంలో చిక్కుకుందని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేనేతపై జిఎస్‌టి విధించడంతో మరింత సంక్షోభంలోకి వెళ్లిందని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన నేతన్న నేస్తం సైతం టిడిపి కూటమి ప్రభుత్వంలో ఇవ్వడం లేదన్నారు. బడ్జెట్‌లో చేనేతలకు కేటాయింపులూ లేవని, 200 యూనిట్ల ఉచిత కరెంటు అమలు కావట్లేదని వివరించారు. చేనేతలకు చంద్రబాబు నాయుడు ఇస్తామన్న రూ.25 వేలు అమలు చేయాలని, ఉచిత విద్యుత్ ఇవ్వాలని, సహకార సంఘాలకు చెల్లించాల్సిన రూ.176 కోట్లు, ఆప్కో సహకార సంఘాల వద్ద కొనుగోలు చేసిన బట్టలకు డబ్బులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలపై దశల వారీ ఆందోళనలు చేపడతా మని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించపోతే చలో అసెంబ్లీ నిర్వహిస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం ఎడికి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుమల వీరబ్రహ్మం, చిట్యాల సీతారామాంజనేయులు, పి హేమసుందరరావు, కె కుమారి, గుంటూరు, పల్నాడు జిల్లాల చేనేత కార్మికులు పాల్గొన్నారు.

జగన్‌దంతా క్రెడిట్ చోరీ

- మంత్రి కొలుసు పార్థసారధి


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో చేసినదంతా క్రెడిట్ చోరీ, దోపిడీనే అని సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారధి ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల గురించి చర్చిస్తుంటే జగన్ మానసిక స్థితి దెబ్బతిని అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. వైసిపి పాలనలో అభివృద్ధి జరిగిందని, ఆ క్రెడిట్‌ను చంద్రబాబు దోచుకుంటున్నారని చెప్పడం అమాయకత్వమా లేక నవ్వాలా అని ప్రశ్నించారు. మొంథా తుపాను సమయంలో చంద్రబాబు ప్రభుత్వం సత్వర స్పందన చూపిందని, నష్ట అంచనా నుంచి కేంద్ర కమిటీని రప్పించడం వరకు, పార్టీ అధికార యంత్రాంగాలను సమన్వయం చేసి క్షేత్రస్థాయిలో యంత్రాంగాన్ని నడిపించిన తీరును అందరూ ప్రశంసిస్తున్నారని చెప్పారు. వైసిపి విధ్వంసాన్ని విజన్‌గా చూస్తే, కూటమి ప్రభుత్వం అభివృద్ధి, ఉద్యోగాలు, పెట్టుబడులతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో ఇప్పటికే రూ.7.68 లక్షల కోట్ల పెట్టుబడులు గ్రౌండ్ అయ్యాయని తెలిపారు.

- యువత భవిష్యత్తును నాశనం చేయడమే జగన్ లక్ష్యమని కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి విమర్శించారు. గత ఐదేళ్లు వైసిపి నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని డ్రగ్స్, గంజాయి వ్యాపారం చేశారని పేర్కొన్నారు. వైసిపి విద్యార్థి నాయకుడు పులగం కొండారెడ్డి లిక్విడ్ డ్రగ్స్ సరఫరా చేస్తూ పట్టుబడ్డారని తెలిపారు.

మెటాకు దండిగా దగా ఆదాయం..!

- మోసపు ప్రకటనలతో రూ.1.40 లక్షల కోట్ల సంపద
- నిషేధిత ఉత్పత్తులకు ప్రచారం
- రోజుకు 15 బిలియన్ల స్కామ్ యాడ్స్
- అంతర్గత పత్రాలు లీక్



వాషింగ్టన్ : సోషల్ మీడియా, టెక్ దిగ్గజం మెటా ఆదాయంలో దండిగా మోసపూరిత ఆదాయం ఉంటుంది. మోసపూరిత, నిషేధిత ఉత్పత్తుల ప్రకటనల ద్వారా 2024 వార్షిక ఆదాయంలో 10 శాతానికి సమానమయ్యే 16 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.1.40 లక్షల కోట్లు) ఆదాయం వస్తుందని ఆ సంస్థ అంచనా వేసింది. దీనికి సంబంధించిన అంతర్గత పత్రాలు లీకు అయ్యాయని రాయిటర్స్ ఓ కథనంలో ధృవీకరించింది. మెటా నిర్వహిస్తోన్న ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ తదితర సోషల్ మీడియా వేదికల్లో ప్రతిరోజూ వినియోగదారులకు 15 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.1.33 లక్షల కోట్ల) విలువ చేసే అధిక రిస్క్, స్కామ్ ప్రకటనలను చూపుతున్నాయని మెటా 2024 డిసెంబర్ డాక్యుమెంట్స్ చూపుతున్నాయి. కేవలం అధిక రిస్కు ప్రకటనలతో ఆ సంస్థకు ఏడాదికి 7 బిలియన్ల (రూ.62వేల కోట్లు) ఆదాయం వస్తోందని అంచనా.

మెటా వేదికల్లో వచ్చే ప్రకటనల్లో మోసం 95 శాతం ఖచ్చితత్వం ఉందని నిర్ధారణ అయితేనే ప్రకటనదారులను బ్లాక్ చేస్తుంది. అంతకంటే తక్కువ ఖచ్చితత్వం ఉన్న సందర్భాలలో కంపెనీ వారి నుంచి జరిమానాలు వసూలు చేస్తుంది. ఇది ఆ సంస్థ లాభాలను మరింత పెంచుతుంది. మోసగాళ్లను నిరుత్సాహపరచాలనే ఉద్దేశ్యంతో జరిమానాలు వేస్తున్నట్లు డాక్యుమెంట్లు చెబుతున్నాయి. వినియోగదారుడు ఒక స్కామ్ యాడ్‌పై క్లిక్ చేసిన యూజర్‌కు మరిన్ని మోసం ప్రకటనలు చూపిస్తుందని మెటా అడ్ పర్సనలైజేషన్ సిస్టమ్ ఆధారంగా తేలింది. 2024లో 10.1 శాతంగా ఉన్న స్కామ్ యాడ్స్ ఆదాయాన్ని 2025 చివరి నాటికి 7.3 శాతానికి, 2026 నాటికి 6 శాతానికి, 2027 నాటికి 5.8 శాతానికి తగ్గించుకోవాలని మెటా తన లక్ష్యంగా నిర్ణయించుకుంది. కొన్ని దేశాల మార్కెట్లలో 50 శాతం వరకు ఉన్న స్కామ్ ప్రకటనలను తగ్గించాలని ప్లాన్ చేసుకుందంటే ఆ ప్రాంతాల్లో ప్రజలను ఎంత మోసానికి గురి చేస్తోందో స్పష్టం అవుతోంది.

ప్రతీ రోజు 220 కోట్ల మంది టార్గెట్

మెటాలోని మోసం ప్రకటనలపై అమెరికా ఎస్‌ఇసి దర్యాప్తు చేస్తోంది. బ్రిటన్‌లో 2023లో చెల్లింపు స్కామ్ నష్టాల్లో 54 శాతం మెటా వేదికలతోనే సంబంధం కలిగి ఉన్నాయని తేలింది. ప్రపంచ వ్యాప్తంగా తప్పుడు ప్రకటనలు, సెలబ్రిటీ ఆకర్షణల ద్వారా ప్రతీ రోజు 220 కోట్ల మంది యూజర్లను మెటా వేదికలు టార్గెట్ చేస్తోన్నాయని అంచనా. సింగపూర్ పోలీసులు ఇచ్చిన 146 స్కామ్ ఫిర్యాదుల్లో కేవలం 23 మాత్రమే మెటా పాలసీ ఉల్లంఘనల కింద వస్తాయని పేర్కొంది. మిగితా 77 స్కామ్‌లు ఉల్లంఘన కింద రావని చెప్పడం ద్వారా ఆ స్కామర్లను కాపాడినట్లయ్యింది. 2023లో వారానికి లక్ష స్పామ్ మెసెజ్ రిపోర్టులు రాగా.. అందులో 96 శాతం ఫిర్యాదులను తిరస్కరించింది. గత అక్టోబర్‌లో రాయల్ కెనడియన్ ఎయిర్ ఫోర్స్ రిక్రూటర్ ఫేస్‌బుక్ ఖాతా హ్యాక్ అయ్యింది. అందులో స్కామర్లు ఫేక్ క్రిప్టో స్కామ్ పోస్టులు పెట్టారు. దీనిపై 100 పైగా రిపోర్టులు వచ్చినప్పటికీ మెటా స్పందన లేదు. ఫలితంగా వినియోగదారులు 40,000 పైగా కెనడియన్ డాలర్లు (రూ.25 లక్షలు) నష్టపోయినప్పటికీ మెటా ఈ కేసుపై కామెంట్ చేయడానికి నిరాకరించింది. వివిధ రూపాల్లో యూజర్లు భారీ ఎత్తున నష్టపోతునప్పటికీ మెటా నిర్లక్ష్యంగా వ్యవహారించడం గమనార్హం.

పక్షపాతంతో కూడుకున్నవి : మెటా

ఈ పత్రాలు పక్షపాతంతో కూడినవని మెటా ప్రతినిధి ఆండీ స్టోన్ పేర్కొన్నారు. గత 18 నెలల్లో స్కామ్ ప్రకటనలపై వినియోగదారుల ఫిర్యాదులను 58 శాతానికి తగ్గించామన్నారు. 13.4 కోట్ల పైగా మోసపూరిత ప్రకటనలను తీసివేసినట్లు ఆయన తెలిపారు.

ఆర్‌బిఐ చర్యలతోనే ఎస్‌బిఐకి లాభాలు

- గవర్నర్ సంజయ్ మల్హోత్రా

ముంబయి : రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) చర్యల వల్లనే ఒకప్పుడు నష్టాల్లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఇప్పుడు 100 బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి చేరిందని ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ముంబయిలో ఎస్‌బిఐ బ్యాంకింగ్, ఎనకమిక్స్ కాన్క్లేవ్ 2025లో మల్హోత్రా మాట్లాడుతూ.. సెంట్రల్ బ్యాంక్ సంస్కరణల వల్లనే 2018లో నష్టాల్లో ఉన్న ఎస్‌బిఐ ఈ స్థాయికి చేరిందన్నారు. ఆర్‌బిఐ రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్, కీలక విధానపరమైన నిర్ణయాలే దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేశాయన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతానికి దీర్ఘకాలిక చర్యలు చేపట్టినట్లు వివరించారు. అదే విధంగా 27గా ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకులను 2020 నాటికి 12కి తగ్గించామన్నారు. బ్యాంకులకు పెద్ద మొత్తంలో మూలధనం సాయం చేశామన్నారు.

సంపాదకీయం

ప్రగతిశీల బాట

ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం ఎన్నికల్లో వామపక్ష ఐక్య కూటమి ప్యానెల్ విజయదుందుభి మోగించడం ప్రస్తుతం ఆధిపత్యం చెలాయించేందుకు దారులు వెతుకుతున్న విద్వేష, విభజన రాజకీయాలకు ప్రతిఘటన. వివిధ సాకులతో లెఫ్ట్ ఐక్యతను కించపరిచే ప్రయత్నాలు అడుగడుగునా సాగినప్పటికీ, ఈ స్పష్టమైన తీర్పు మూడు విద్యార్థి సంస్థల కూటమి రూపొందించిన లౌకిక, ప్రజాస్వామ్య సూత్రప్రాయమైన విధానం ఔచిత్యాన్ని నొక్కి చెప్పింది. జెఎన్‌యుఎస్‌యు నాలుగు ప్రధాన ప్యానెల్ పదవులకు, 42 కౌన్సిలర్ పోస్టులకు మంగళవారం ఓటింగ్ జరగ్గా 67 శాతం పోలింగ్ నమోదైంది. ఆ రోజు సాయంత్రం నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగగా గురువారం సాయంత్రానికి తుది ఫలితాలొచ్చాయి. అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, సహాయ కార్యదర్శి.. నాలుగు ప్రధాన ప్యానెల్ పదవులను లెఫ్ట్ యూనిటీ భారీ మెజార్టీలతో కైవసం చేసుకొని క్లీన్‌స్వీప్ చేసింది. పలు కౌన్సిలర్ పదవులను సైతం లెఫ్ట్ యూనిటీ గెలిచింది. గత ఎన్నికల్లో సహాయ కార్యదర్శి పదవి ఒక్కటీ నానాగడ్డికరిచి దక్కించుకున్న బిజెపి అనుబంధ సంఘం ఎబివిపి, ఈ సారి ఆ స్థానాన్ని సైతం కోల్పోయి మొత్తానికే తుడిచిపెట్టుకుపోయింది. జెఎన్‌యును తన విద్వేష రాజకీయాలకు కేంద్రంగా మార్చుకొనేందుకు కుట్రలు పన్నుతున్న బిజెపికి ఈ ఎన్నికల ఫలితాలు పెద్ద షాక్.

అటు కేంద్రంలో ఇటు ఢిల్లీ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వాల అండదండలు, ఆర్‌ఎస్‌ఎస్, విద్వేష కుతంత్రాలు పుష్కలంగా కలిగిన ఎబివిపి పై వామపక్ష విద్యార్థి సంఘాలు ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎ, డిఎస్‌ఎఫ్‌లు జెఎన్‌యుఎస్‌యు ఎన్నికల్లో వీరోచితంగా పోరాడి మట్టికరిపించడం మామూలు విషయం కాదు. జెఎన్‌యు ఎన్నికలంటే యావత్ దేశానికి, ముఖ్యంగా విద్యార్థులకు, యువతకు అమితమైన ఆసక్తి. జెఎన్‌యులో ఆలోచనలు సంఘర్షిస్తాయి. అభివృద్ధి నిరోధక, ప్రగతిశీల శక్తుల మెదళ్లు ఘర్షిస్తాయి. జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై నిరంతరం తూలనాత్మక చర్చలు చేసే వేదిక జెఎన్‌యు. ప్రజాస్వామ్యానికి, మానవ హక్కులకు ఎక్కడ ముప్పు వాటిల్లినా ప్రశ్నించి నిరసించి గళమెత్తే గొంతుక. అభివృద్ధి నిరోధకులపై ఉక్కు పిడికిలి. నిరంకుశత్వానికి, మతోన్మాదానికి, కార్పొరేట్లకు దోచిపెట్టే విధానాలకు జై కొట్టే ఆర్‌ఎస్‌ఎస్‌కు, బిజెపికి జెఎన్‌యు ఆ విధంగా వైవిధ్యంగా విలక్షణతతో ఉండటం ఎంత మాత్రం ఇష్టం లేదు. తన సహజసిద్ధ ఏకరూప సిద్ధాంతంతో యూనివర్శిటీలో వైషమ్యాలను రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకున్నాయి. జెఎన్‌యు ఎన్నికల్లో ఎబివిపిని గెలిపించేందుకు, లెఫ్ట్ కూటమిని ఓడించేందుకు యూనివర్శిటీ పాలకవర్గం చేసిన ప్రయత్నాలు ఎన్నో కనిపిస్తాయి. పాలస్తీనాపై అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ చేస్తున్న వికృత యుద్ధోన్మాదాన్ని జెఎన్‌యు విద్యార్థులు నిరసించడం బిజెపికి, ఆర్‌ఎస్‌ఎస్‌కు కంటగింపు. అమెరికా మార్గదర్శకత్వంలో నాటో కూటమి ఉక్రెయిన్‌కు సహకరించి రష్యాపైకి దండెత్తడం తప్పని జెఎన్‌యు విద్యార్థులు ఖండిస్తే బిజెపి, సంఘ్ తట్టుకోలేవు. సిఎఎను నిరసించినా, 370 ఆర్టికల్ రద్దుపై నిలదీసినా, మతతత్వ శక్తుల పాశవిక దాడులపై గొంతెత్తినా, ప్రభుత్వ విద్యార్థి వ్యతిరేక విధానాలపై పోరాడినా, చివరికి యూనివర్శిటీలో సమస్యలపై ఆందోళనలు చేసినా నేతల అక్రమ అరెస్టులు, పోలీస్ బల ప్రయోగాలు, కఠినమైన కేసులు నిత్యకృత్యమయ్యాయి.

బిజెపి సర్కారు ఒక వైపు నూతన విద్యా విధానం పేరిట విద్యను కార్పొరేటీకరిస్తూ, మరో వైపు యూనిర్శిటీ పరిపాలనలో సంఘ్ పరివార్ అనుకూలురను చొప్పించి హిందూ జాతీయ ప్రాజెక్టు అమలుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈ రాజకీయాలను, విధానాలను వ్యతిరేకిస్తూ ఇటీవలి కాలంలో విద్యాసంస్థల ఎన్నికల్లో వామపక్ష, ప్రగతిశీల శక్తులు గెలుపొందుతున్నాయి. తాజాగా జెఎన్‌యు, పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్శిటీ మొదటి దశ ఎన్నికల్లో ఎస్‌ఎఫ్‌ఐ విజయభేరి మోగించింది. మొత్తం 117 కౌన్సిలర్ స్థానాలకు గాను 68 చోట్ల ఎస్‌ఎఫ్‌ఐ గెలిచింది. రెండవ దశ ఎన్నికల్లో ప్రధాన ప్యానెల్ పోస్టులనూ ఎస్‌ఎఫ్‌ఐ కైవసం చేసుకుంటుందని ఆశించవచ్చు. బిజెపి, సంఘ పరివార్ మతతత్వ, విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ప్రగతిశీల, ప్రజాస్వామ్య ఉద్యమాలు అనివార్యమైనవి.

మహనీయుల మాట



మహిళల శ్రమ పట్ల ప్రత్యేకంగా పెట్టుబడిదారులు ఆకర్షితులు కావడానికి కారణం... అది చౌకగా లభించడం మాత్రమే కాదు. వారు చాలా అణకువగా వుండడం కూడా.

- క్లారా జెట్కిన్, జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ.

'విభజన విద్వేషాలకు' విరుగుడు

సమాధిలోని లార్డ్ కర్జన్ ముసిముసిగా నవ్వుకుంటూ వుంటాడు. బారక్ లోయలో, ఇటీవలనే శ్రీభూమిగా పేరు మార్చిన కరీంగంజ్ జిల్లాలో స్థానిక కాంగ్రెస్ నాయకులొకరు రవీంద్రనాథ్ టాగూర్ గీతం ('అమర్ సోనార్ బంగ్లా, అమీ తోమై వలోబాషి...' అన్న చిరస్మరణీయ గీతం) పాడారు. ఇంకేముంది హిమంత బిశ్వ శర్మ ప్రభుత్వం ఆ వెంటనే తీవ్రంగా విరుచుకుపడింది. ప్రతిపక్షంపై దాడి చేయడానికీ వారి విధేయతను ప్రశ్నించడానికీ చిక్కిన గొప్ప అవకాశంగా స్వయంగా ముఖ్యమంత్రి దాన్ని పరిగణించారు. 1971లో జాతీయ విమోచనోద్యమ విజయం, నూతన రిపబ్లిక్ స్థాపన తర్వాత బంగ్లాదేశ్ దాన్ని తమ జాతీయ గీతంగా స్వీకరించింది. ఆరెస్సెస్, బిజెపి దీనికి దేశాంతర విధేయతను ఆపాదించేందుకు సిద్ధమైపోయాయి. తమపై ఉర్దూ రుద్దడానికి వ్యతిరేకంగా తమ భాషా సాంస్కృతిక భావనలు వెల్లడించడానికి తూర్పు పాకిస్తాన్ లోని బెంగాలీ ప్రజానీకం ఈ పాటను పాడారనే సంగతి వారు కావాలనే ఇష్టపూర్వకంగా మర్చిపోయారు. పాకిస్తాన్ పాలకులుగా వున్న మత ప్రేరిత జాతీయతా భావనను బలవంతంగా తమపై విధించడాన్ని వ్యతిరేకించే క్రమంలో ఈ పాటనే పాడారు.

ఏమైనా వైవిధ్యభరితమైన సంస్కృతికి నిలయమైన దక్షిణాసియా గడ్డపై జాతీయతకు కేవలం ఏకరూప నిర్వచనం ఇవ్వడం నిలిచేది కాదని సమకాలీన చరిత్ర చెబుతున్నది. విభజన, వేర్పాటుతత్వంతో కూడిన బ్రిటిష్ వలసవాద విధానానికి వ్యతిరేకంగా బెంగాలీ ప్రజానీకం పాటించిన సమ్మిళిత దృక్పథానికి ఈ గీతం ఆవిర్భావ వికాసాలే ఒక తార్కాణం. సాంస్కృతిక వైవిధ్యం, వేల మైళ్ల దూరంగల రెండు ప్రాంతాలను కలిపివుంచడానికి మతపరమైన గుర్తింపు గురించిన మురిపెం ఒక్కటే సరిపోదని చెప్పడానికి ఇంతకన్నా బలమైన ఆధారం అక్కర్లేదు.

టాగూర్ గీతంపై కత్తి

బ్రిటిష్ ప్రభుత్వం బెంగాల్‌ను మొదటిసారి విభజించడానికి నిరసనగా రాయబడిన పాట అది. అవిభక్త బెంగాల్ రాష్ట్రాన్ని రెండుగా విభజించాలనే నిర్ణయం 1905 జులై 19న లార్డ్ కర్జన్ ప్రకటించారు. అది అక్టోబర్ 16న అమలులోకి వచ్చింది. విభజనకు శక్తివంతమైన నిరసనగా కలకత్తా లోని చారిత్రిక టౌన్‌హాల్‌లో 1905 ఆగష్టు 7న జరిగిన నిరసన సభ కోసం టాగూర్ ఈ పాట రాశారు. ఇందులోని ప్రతిఘటన వారసత్వానికి నిజమైన కొనసాగింపుగానే పాటలోని మొదటి పది పంక్తులను బంగ్లాదేశ్ జాతీయ గీతంగా తాత్కాలిక ప్రభుత్వం 1971 ఏప్రిల్ 10న విమోచన సమరంలో స్వీకరించింది. ఈ రోజున కర్జన్ వారసత్వమే బిజెపి, ఆరెస్సెస్‌లనూ వారి ప్రచార వేషధారి హిమంతనూ రగిలిస్తున్నది. ఆ పాట పాడటం జాతి వ్యతిరేకమని అస్సాం ప్రభుత్వం ప్రకటించింది. బంగ్లాదేశ్ జాతీయ గీతంగా స్వీకరించబడటానికి 66 ఏళ్ల కిందట రాసిన పాటను పాడితే అది బారక్ లోయ ప్రజలు అన్య దేశ విధేయత చూపడంగా చెప్పేందుకు ప్రయత్నం జరుగుతున్నది.

> **విభజనకు శక్తివంతమైన నిరసనగా కలకత్తా లోని చారిత్రిక టౌన్‌హాల్‌లో 1905 ఆగష్టు 7న జరిగిన నిరసన సభ కోసం టాగూర్ ఈ పాట రాశారు. ఇందులోని ప్రతిఘటన వారసత్వానికి నిజమైన కొనసాగింపుగానే పాటలోని మొదటి పది పంక్తులను బంగ్లాదేశ్ జాతీయ గీతంగా తాత్కాలిక ప్రభుత్వం 1971 ఏప్రిల్ 10న విమోచన సమరంలో స్వీకరించింది. ఈ రోజున కర్జన్ వారసత్వమే బిజెపి, ఆరెస్సెస్‌లనూ వారి ప్రచార వేషధారి హిమంతనూ రగిలిస్తున్నది. ఆ పాట పాడటం జాతి వ్యతిరేకమని అస్సాం ప్రభుత్వం ప్రకటించింది. బంగ్లాదేశ్ జాతీయ గీతంగా స్వీకరించబడటానికి 66 ఏళ్ల కిందట రాసిన పాటను పాడితే అది బారక్ లోయ ప్రజలు అన్య దేశ విధేయత చూపడంగా చెప్పేందుకు ప్రయత్నం జరుగుతున్నది.**



PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

వాస్తవంగా ఈ పాటపై యుద్ధం కేవలం బెంగాల్ భాషపై పథకం ప్రకారం జరిగే దాడికి కొనసాగింపు మాత్రమే కాదు. దాన్ని పాడటం అంటే బంగ్లాదేశీ ముద్ర వేసి చట్టవిరుద్ధంగా ప్రకటించడం మాత్రమే కాదు. భాషను, చొరబాటును ముడిపెట్టడాన్ని మళ్లీ గట్టిగా ముందుకు తెచ్చే ఉద్వేగభరిత సూత్రీకరణ ఇది. సరిహద్దుకు ఇరువైపులా ఒకే భాష మాట్లాడవచ్చుననే వాస్తవాన్ని మనమెలా మటుమాయం చేయగలం?

హిమంత నిస్పృహ, గిరిజనుల నిరసన

వచ్చే ఏడాది ప్రారంభంలోనే ఎన్నికలు జరగనున్న అస్సాంలో బిజెపి హిమంత, పూర్తి నిస్పృహలో వున్నారనడం నిస్సందేహం. స్వయంగా ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగే భూకబ్జాలకు బలవుతున్న ప్రజలు తొలగింపులనూ బుల్డోజర్లనూ ప్రతిఘటిస్తున్నారు. గిరిజన ప్రాంతాలలో భూ ఆక్రమణ పేరుతో మైనార్టీలపై యుద్ధం సాగించడం ఇంకేమాత్రం సాధ్యపడే పరిస్థితి లేదు. అస్సాంలోని ఆరు గిరిజన వర్గాలు-తాయ్ అహోం, మొరాన్, మొటోక్, చుటియా, టీ తెగలు లేదా కూచ్ రాజ్ భంగ్సీ ఆదివాసీలు అత్యధిక స్థాయిలో ప్రతిఘటనకు దిగుతున్నారు. ఆ రాష్ట్ర మొత్తం జనాభాలో వీరంతా కలిస్తే దాదాపు ముప్పై శాతం వున్నారు. బిజెపి మద్దతుదారులలో ప్రధాన భాగంగా వున్న వీరు ప్రస్తుతం గిరిజన హోదా (ఎస్‌టి) కోరుతూ వీధుల్లోకి వచ్చారు. రాష్ట్రంలో ఇతర వెనకబడిన వర్గాల (ఓబిసి) జాబితాలో చేర్చబడిన వీరంతా ఇప్పుడు షెడ్యూల్డు తెగలుగా గుర్తించాలని కోరుతున్నారు. ఈ జాబితా వల్ల లభించే పరిమిత అవకాశాలకన్నా ఆ విధంగా తమకు విద్యా సంస్థలలో, ప్రభుత్వ ఉద్యోగాలలో ఎక్కువ అవకాశం లభిస్తుందని వారి అభిప్రాయంగా వుంది.

రాష్ట్ర యువతలో విపరీతమైన నిరుద్యోగంతో పాటు ఎలాంటి జాతి మత విభజనలు లేకుండా ఒక్క తాటిపైకి తెస్తున్నది మరొకటి వుంది. అస్సాం ప్రజల ప్రియతమ పుత్రుడైన జుబిన్‌గార్గ్ ఎంతో ధైర్యంగా ముందుకు తెచ్చిన నూతన దార్శనికతను వారు ఒక్క గొంతుతో నిర్భయంగా వినిపిస్తున్నారు. హిమంత అంతగా రెచ్చిపోవడానికి నేపథ్యం అదే.

అయితే కేవలం అస్సాంలోనే కాదు. దేశమంతా హిందూత్వ వేర్పాటు రాజకీయాలతో ముందుకొస్తున్న విద్వేషపు గొంతుకలు ఇంకా చాలా వున్నాయి. భాషా సమస్యనే తీసుకుంటే కొంతకాలం కిందట హిందీ రుద్దడానికి వ్యతిరేకంగా మరాఠీ భాష కోసం నిరసన గొంతులు వినిపించాయి.

తేలిపోయిన 'సర్'

చొరబాట్లు, చొరబాటుదారులు అనేవాటికి వ్యతిరేకంగా నిరతం ప్రచారం చేసిన హిందూత్వ అగ్రదళాలు ఎన్నికల కమిషన్‌ను సతాయించి 'సర్' ప్రక్రియ మొదలెట్టేట్లు చేశాయి. పౌరసత్వ సమస్యను దొడ్డిదోవన తీసుకొచ్చాయి. అయితే వాస్తవంలో అది పూర్తిగా పైపైనే తేలిపోయింది. మొత్తంపైన పరిశీలించిన 7 కోట్ల 42 లక్షల మంది ఓటర్లలో కేవలం 9,500 మంది లేదా 0.012 శాతం మాత్రమే విదేశీయులని తేలింది. శోధించి తొలగించి తరలించు అంటూ అమిత్ షా హడలెత్తించినా దానికి ఏమాత్రం ప్రాతిపదిక లేదని నిరూపితమైంది.

అయితే నిజం ఎందుకు వంటపడుతుంది? మనం సత్యానంతర ప్రపంచంలో వున్నాం కదా! ఇదేమో ఎన్నికల సీజనాయె. బిజెపి దగ్గరున్న కోట్లతో ఫేక్ వార్తల యంత్రాలు అహోరాత్రులు పనిచేసి మరిన్ని కట్టుకథలు, వక్రీకరణలు వదులుతాయి. వారు పరాయి వారంటూ విద్వేషం వండివార్చుతాయి. జీవితాన్నీ అలాగే అసలు ఉనికికి మూలమైన జీవనోపాధినీ చుట్టుముడుతున్న ఈ నిత్యసంక్షోభాన్ని, ముక్త కంఠంతో ఎదుర్కోవాలంటే మనం ఒక్కతాటిపై నిలవడం, ఒక్క గొంతు వినిపించడం అత్యవసరం.

(నవంబర్ 5 'పీపుల్స్ డెమొక్రసీ' సంపాదకీయం)

అభిప్రాయం

ఎవరు విశిష్ట వ్యక్తి?

మ్యాజిక్కులతో చిన్న చిన్న లింగాలను నోట్లో నుండి తీసి, చేతిలో దాచిపెట్టుకున్న విభూదిని గాలిలో నుండి సృష్టించినట్లు నటిస్తూ, ఇదంతా తన మాహాత్యం అని ప్రపంచ ప్రజలను మోసం చేసినవాడు విశిష్ట వ్యక్తా? లింగాలు కాదు, గుమ్మడికాయలు సృష్టించమని హేతువాదులు 50 సంవత్సరాల నాడే పుట్టపర్తి సాయిబాబాకు సవాల్ విసిరారు. 1976లో బెంగళూరు యూనివర్శిటీ వైస్ చాన్సలర్ హెచ్.నరసింహయ్యతో ఒక కమిటీ వేసి, సాయిబాబా మహత్యాలను తమ ముందు ప్రదర్శించి నిజాయితీని నిరూపించుకోవాలని సాయిబాబాకి డాక్టరు కోవూరు ఉత్తరాలు రాశారు. సమాధానం లేదు. కోవూరు బృందం పుట్టపర్తి వెళ్లగా, సాయిబాబా బెంగళూరు పారిపోయాడు. ఇలాంటి పారిపోయిన వ్యక్తి విశిష్ట వ్యక్తా? 1993లో పి.వి.నరసింహారావు ప్రధానిగా ఉన్నపుడు, హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో సాయిబాబా ఒక గొలుసును గాలి లోంచి సృష్టించినట్లు తీసి ప్రధానికి ఇచ్చాడు. ఆ గొలుసును తన అసిస్టెంట్ నుండి సంగ్రహించి తీయడం ఒక కెమెరాలో చిక్కింది. దాన్ని ఆ రోజుల్లో ఈ గారడీవాని ట్రిక్కులను ఊరూరా ప్రదర్శించటం జరిగింది. అందుకు ఈయనను విశిష్ట వ్యక్తి అనాలా! 1993 జూన్ ఆరున సాయిబాబా ఆశ్రమంలో ఆరు హత్యలు జరిగాయి. వీటి వెనుక ఒక మహిళ ఉన్నదని అప్పటి రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ ప్రకటించారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు ఆ హత్యల నిగ్గు తేల్చమని డిజిపి హెచ్.దొర ను ఆదేశించారు. ఎందువలనో జరగలేదు. అందుకు విశిష్ట వ్యక్తి అనాలా? మ్యాజిక్కులను మహత్యాలుగా ప్రచారంగా చేసుకొని వేల కోట్లకు పడగలెత్తినందుకు విశిష్ట వ్యక్తి అనాలా! ఇలాంటి వారిని 'ది డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీ యాక్ట్ 1954' కింద అరెస్టు చెయ్యాలి. అరెస్టు కాకుండా తప్పించుకున్నందుకు విశిష్ట వ్యక్తి అనాలా! అంతేకాదు, దొంగలను విశిష్ట వ్యక్తి అన్నవారూ నిజమైన దొంగలే.

- నార్నె వెంకట సుబ్బయ్య

విమర్శ


ఎనిమిదవ వేతన సంఘంతో ఉద్యోగులకు కష్టం!

సత్య

కేంద్ర ప్రభుత్వం ఎనిమిదవ వేతన కమిషన్‌ను నియమించింది. ఈ మేరకు నవంబరు మూడవ తేదీన గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ రోజు నుంచి పద్దెనిమిది నెలల్లో నివేదికను సమర్పించాలని దానిలో నిర్దేశించారు. నరేంద్ర మోడీ సర్కార్ ఏర్పాటు చేసిన తొలి సంఘం ఇది. ఈ క్రమాన్ని చూసినపుడు ప్రతిదాన్నీ ఓట్ల కోసం ఎలా వినియోగించు కుంటున్నారో దీన్లో కూడా చూడవచ్చు. ఏడవ వేతన సంఘాన్ని 2014 ఫిబ్రవరిలో నియమించగా 2015 నవంబరులో నివేదిక సమర్పించింది. ఈ లెక్కన ఈ పాటికి ఎనిమిదవ వేతన సంఘ నివేదిక కేంద్ర ప్రభుత్వానికి అందాల్సి ఉంది. దూరాలోచన లేదా దుష్టాలోచనతో ఎన్నికల కోసం ఆలస్యం చేశారనిపిస్తోంది. సరిగ్గా ఢిల్లీ ఎన్నికలకు ముందు ప్రకటన చేశారు. ఇప్పుడు బీహార్ ఎన్నికల సందర్భంగా కమిషన్ నియామకాన్ని ప్రకటించారు. దీని సిఫార్సులు, కేంద్రం పరిశీలించి అమలు చేయాల్సిన సమయానికి లోక్‌సభ ఎన్నికలు వస్తాయి. ఈ కమిషన్ సిఫార్సులు 2028 లోగా అమల్లోకి వచ్చే అవకాశం లేదని సీనియర్ అధికారులు చెబుతున్నారంటే దాని అర్థం అదే. మరొక ప్రమాదం ఏమిటంటే బకాయిలను ఎగవేసే అవకాశం కూడా ఉందని చెబుతున్నారు. ఎన్నికల ముందు అమలు చేసి చూశారా మీకు ఎంత మేలు చేశామో, దానికి మాకేమిటి అని అడిగేందుకు ఒక ప్రచార అస్త్రంగా ఉండనుంది.

పదేళ్లకు ఒకసారి నియమిస్తున్న వేతన సంఘం ఉద్యోగులు, పెన్షనర్ల మీద ఖర్చు ఎలా తగ్గించాలా అని చూస్తున్నది. అయితే సంఘటితంగా ఉద్యోగులు ఉన్న కారణంగా వాటి ఎజెండా పూర్తిగా అమలు చేయటం సాధ్యం కావటం లేదు. ఇప్పుడు కూడా అదే జరగనుందా ?

వేతన, పెన్షన్ బిల్లుల గురించి గుండెలు బాదుకుంటూ మీడియాలో విశ్లేషణలు రాస్తున్నారు. వంది మాగధులు రాజుగారి మనసెరిగి వ్యవహరిస్తారన్నది తెలిసిందే. ఇదీ అంతే! వేతనాలకు మించి పెన్షన్ బిల్లు పెరిగిపోతోందన్నది వాటిలో



ఒకటి. భవిష్యత్‌లో ఉద్యోగులకు వార్షిక ఇంక్రిమెంట్లను వారు అందించిన సేవలు, డిజిటల్ పాలన మైలురాళ్లు, పౌరుల సంతృప్తి సూచికల ప్రాతిపదికన ఇవ్వాలని ఆర్థికవేత్తలు సలహా ఇస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగ చరిత్రలో ఎనిమిదవ వేతన సంఘ కసరత్తు పెనుసవాళ్లతో కూడిన వాటిలో ఒకటిగా రూపుదిద్దుకుంటున్నదట. కోటీ ఇరవై లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లే కాదు, అంతకంటే ఎక్కువగా ఉండే రాష్ట్రాల సిబ్బంది మీద కూడా ఈ కమిషన్ సిఫార్సుల ప్రభావం పడనుంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 50 లక్షల మంది వరకు ఉండగా పెన్షనర్లు 69 లక్షల మంది ఉన్నారని, రాబడిలో 18 శాతం వేతనాలు, పెన్షన్లకే పోతున్నదని, ఒకవైపు పొదుపు మరోవైపు న్యాయమైన వేతన సవరణ డిమాండ్ల మధ్య పోరు జరగనుందని చెబుతున్నారు. ప్రైవేటు రంగానికి నిపుణులైన వారు వెళుతున్నందున ప్రభుత్వ రంగానికి వారిని ఆకర్షించేందుకు 1990 దశకం నుంచి ప్రతి వేతన కమిషన్ సిఫార్సులలో వేతన వృద్ధి దేశ తలసరి ఆదాయ వృద్ధి రేటు కంటే ఎక్కువగా ఉంటున్నదట. వేతన, పెన్షన్ ఖర్చు పెరిగిపోవటం వలన మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్య రంగాలకు నిధుల కొరత ఏర్పడుతున్నదట. ఒక ఏడాది కాగానే ఇంక్రిమెంట్, కరువు భత్యం వాయిదాలు చెల్లించటం కాకుండా సామర్థ్యం, ఉత్పాదకత ప్రమాణాలు దాటిన తరువాతే ఇవ్వాలని కొందరు సూచిస్తున్నారు. దానికి అనుగుణంగానే జస్టిస్ రంజనా దేశాయ్ ఆధ్వర్యంలోని ఎనిమిదవ వేతన కమిషన్‌కు ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలు ఉన్నాయి. వీటిని చూసిన తరువాత ఇదే చివరి వేతన సంఘం అన్న వారు కూడా ఉన్నారు. పరిహారం చెల్లింపు విషయంలో నూతన నమూనాలను పరిశీలించాలని, జవాబుదారీతనం, సామర్థ్యం ప్రతిఫలించాలని వాటిలో పేర్కొన్నారు. అయితే వీటిని ఎవరూ వ్యతిరేకించటంలేదు, అనుసరించే కొలబద్దలు ఏమిటన్నదే సమస్య.

ప్రకటించిన వివరాల మేరకు పద్దెనిమిది నెలల్లో నివేదిక అంటే సమర్పణకే 2027 ఏప్రిల్ వరకు ఆగాల్సిందే. ఇతర కారణాలు చూపి ఆలస్యం చేస్తే చేయగలిగిందేమీ లేదు. మధ్యంతర నివేదికను కూడా ప్రకటించవచ్చు. నూతన వేతనాలు 2026 జనవరి ఒకటి నుంచి అమల్లోకి రావాల్సి ఉంది. వేతన కమిషన్ ఇంతవరకు ఉద్యోగుల ముందు ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదు. అయితే ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ 2.86 ప్రకారం రూ. 19 వేల వరకు వేతనాలు పెరగవచ్చని కొందరు చెబుతున్నారు. గత వేతన కమిషన్ 2.57ను తీసుకుంది. దాని ప్రకారం మూల వేతనం రూ. 7 నుంచి రూ. 18 వేలకు పెరిగింది. ఇప్పుడు రూ. 18 నుంచి రూ. 46,260, పెన్షన్ రూ. 9 నుంచి రూ. 23,130కి పెరగవచ్చని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. అయితే కేంద్ర మాజీ ఆర్థిక శాఖ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ 1.92గా ఉండవచ్చని, కనీస వేతనం రూ. 34,500 అవుతుందని చెప్పారు. మధ్య స్థాయిలో ఉండే ఉద్యోగివేతనం ప్రస్తుతం రూ. ఒక లక్ష ఉన్నదని, వేతన పెంపుదల శాతాన్ని బట్టి దానికి అదనం అవుతుందని భావిస్తున్నారు. ఉదాహరణకు ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ 2.5 అనుకుంటే అది రెండున్నర లక్షలు అవుతుంది. కమిషన్ ఎలాంటి సిఫార్సులు చేసినప్పటికీ దాన్ని ప్రభుత్వం సవరించవచ్చు.

ఎనిమిదవ వేతన సంఘం గురించి ఒక్క ముక్కలో చెప్పాలంటే...! వేతన సంఘం అంటే వేతనాలు, పెన్షన్లు, అలవెన్సులను సిఫార్సు చేయటమే కాదు. ఇప్పుడు దేశంలో అమలు జరుగుతున్న విత్త నమూనా తట్టుకొని నిలుస్తుందా లేదా అన్నది కూడా తేలాల్సి ఉంటుందని కొందరు విశ్లేషకులు పేర్కొన్నారంటే ఏదో ముప్పు మూడినట్లే కనిపిస్తోంది. 2026 జనవరి లోగా ఉద్యోగ విరమణ చేసే వారికి నూతన వేతనాలు, పెన్షన్లు వర్తిస్తాయా లేదా అన్నది అనుమానమే. అందువలన ఈ వేతన సంఘం 2029లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి దాని మిత్రపక్షాలకు ఒక అగ్నిపరీక్షగా మారనుందని కూడా చెప్పవచ్చు.

సందర్భం

బీమా రంగంపై కార్పొరేట్ పడగ




యల్.మంజునాథ్

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్.ఐ.సి) ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యున్నత పది బీమా కంపెనీలలో మూడవ స్థానంలో ఉంది. భారతదేశంలోని 23 ఇన్సూరెన్స్ కంపెనీల పోటీ మధ్య నంబర్ వన్‌గా కొనసాగుతున్నది. దీనికి ప్రధాన కారణం కంపెనీకి రాయబారులుగా పనిచేస్తున్న 14 లక్షల మంది ఎల్ఐసి ఏజెంట్లు. వారు తమ పాలసీ అమ్మకాలు, సేవల ద్వారా పాలసీదారుల నమ్మకాన్ని, విశ్వాసాన్ని నిలబెట్టుకున్నారు. దీనివల్లనే ఎల్ఐసి ఈ స్థాయికి ఎదిగింది.

కేంద్ర ప్రభుత్వ పంచవర్ష ప్రణాళికల నుండి దేశంలోని అభివృద్ధి పనులు, భారీ నిర్మాణాలు, రాష్ట్ర ప్రభుత్వ-స్థానిక సంస్థలు చేపట్టే ప్రజాప్రయోజన ప్రాజెక్టుల కోసం సుమారు రూ.39 లక్షల కోట్ల స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను ప్రజల సంక్షేమం కోసం ఎల్ఐసి అందించింది. ప్రస్తుతం ఎల్ఐసి లైఫ్ ఫండ్ రూ.47.84 లక్షల కోట్లు. వివిధ సంస్థలలో ఎల్ఐసి పెట్టుబడుల విలువ రూ.54.52 లక్షల కోట్లు. అదేవిధంగా 2025 మార్చి నాటికి రూ.57 లక్షల కోట్ల ఆస్తులను ఎల్ఐసి కలిగి ఉన్నది. గత 68 సంవత్సరాలుగా దేశ ప్రజల సహకారంతో ఈ భారీ మొత్తాన్ని సేకరించగలిగింది.

నూతన ఆర్థిక విధానాలు ప్రారంభమైన తర్వాత ప్రభుత్వ బీమా సంస్థలను అస్థిరపరచి, ఇన్సూరెన్స్ మార్కెట్‌ను ప్రైవేటు కంపెనీలకు అప్పగించే కార్యక్రమం జరుగుతున్నది. ప్రజా ప్రయోజనాల కోసం అని చెప్పి 1994లో ఆర్.యన్.మల్హోత్రా కమిటీని, 2009లో డి.స్వరూప్ కమిటీని నియమించారు. ఈ రెండు కమిటీలు కూడా పాలసీదారులు, ఏజెంట్లు, ఎల్ఐసి సంస్థకు నష్టం కలిగించే అనేక సిఫార్సులు చేసి పరోక్షంగా ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు తోడ్పడే పని చేశాయి. యుపిఎ 1, యుపిఎ 2 ప్రభుత్వాల సమయంలో వామపక్ష పార్లమెంటు సభ్యుల సహకారంతో వీటిని అమలు కాకుండా ఎల్ఐసి ఎఐఐఇఎ మిగతా యూనియన్లను కలుపుకొని పోరాటం చేసి నిలుపుదల చేయించ గలిగింది. కానీ 2014లో మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సిఫార్సులను వేగంగా అమలు చేశారు. ఫలితంగా ఇన్సూరెన్స్ మార్కెట్లో ప్రైవేట్ కంపెనీలో ఆధిపత్యం క్రమేణా పెరుగుతున్నది.

ఈ రెండు కమిటీల సిఫార్సుల మేరకు అమలు చేసిన విధానాల వల్ల 2022లో ఐపీఓ ద్వారా 3.5 శాతం ఎల్ఐసి షేర్లను విక్రయించి రూ.20,557 కోట్లు కేంద్ర ప్రభుత్వం పొందింది. అంతేగాక ఈ సంవత్సరం 10 శాతం షేర్లను, 2030 నాటికి 25 శాతం షేర్లను



విక్రయించే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తుంది. దీనివల్ల ఎల్ఐసికి రావాల్సిన ఆరు లక్షల కోట్ల ప్రీమియాన్ని ఇప్పటి వరకు కోల్పోయింది. భవిష్యత్తులో ఇది మరింత పెరిగే ప్రమాదం ఉంది. అదేవిధంగా గతంలో ప్రభుత్వ పథకాలలో పెట్టుబడి పెట్టి తద్వారా వచ్చిన ఆదాయాన్ని ప్రజలకు చెల్లించే అవకాశం ఇప్పుడు లేకుండా పోయింది.

కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని ఐ.ఆర్.డి.ఎ.ఐ సూచనల మేరకు 2024 అక్టోబర్ నుండి ఇన్సూరెన్స్ పాలసీలలో అనేక కొత్త మార్పులు వచ్చాయి. ఒకవైపు పాలసీ సులభంగా రద్దు చేసుకునే అవకాశం పాలసీదారుడికి ఇచ్చి, మరోవైపు పాలసీ రద్దయితే ఆ పాలసీపై ఏజెంట్ ఆపాటికే పొందిన కమిషన్‌ను తిరిగి వెనక్కి తీసుకుంటామని చెప్పడం ప్రభుత్వం అసలు ఉద్దేశాన్ని స్పష్టం చేస్తుంది. పాలసీదారులకు ప్రీమియం రేటు పెంచడంతోపాటు పాలసీ లోన్లపై 8 శాతం నుండి 10 శాతం వడ్డీని వసూలు చేస్తుంది. మరోవైపు ఏజెంట్లకు కొత్త సౌకర్యాలు కల్పించకపోగా ఉన్న వాటిని తొలగించే ప్రయత్నం చేస్తుంది. వీటితోపాటు ఆన్‌లైన్లో పాలసీలు విక్రయించడం, హెల్త్ ఇన్సూరెన్స్‌లో ఉన్నట్లుగా పాలసీ పోర్టబిలిటీ జీవిత బీమాలో కూడా ప్రవేశపెట్టాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. ఇది ఎల్ఐసి సంస్థకు పెద్ద ఎదురు దెబ్బ. ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు పెద్ద వరంగా మారుతుంది.

ఈ విధానాల వల్ల ఎల్ఐసి సంస్థకు, పాలసీదారులకు, ఎల్ఐసి ఏజెంట్లకు అందరికీ నష్టమని ప్రభుత్వానికి తెలిసే వాటిని ప్రోత్సహిస్తున్నది. కాబట్టి ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టాలంటే గతం కంటే మరింత ఎక్కువ సంఘటితంగా పోరాడాలి. ఈ పోరాటంలో ఉద్యోగులను, పాలసీదారులను, భావ సారూప్యం కలిగిన వ్యక్తులను, సంస్థలను కలుపుకొని ఐక్య ఉద్యమాలను నిర్వహించాలి.

నేటి నుంచి ఖమ్మంలో ఎల్ఐసి ఎఐఐ 6వ జోనల్ మహాసభలు

/వ్యాసకర్త ఆల్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎల్ఐసి ఎఐఐ సెంట్రల్ కమిటీ, సెల్: 9448125620 /

దళారులను నమ్మి మోసపోవద్దు

- 'డయల్ యువర్ ఇఒ'లో అనిల్ కుమార్ సింఘాల్

ప్రజాశక్తి –తిరుమల

శ్రీవారి దర్శనానికి దళారులను నమ్మి మోసపోయిన్నట్లు ఇటీవల హైదరాబాద్‌కు చెందిన కొందరు యాత్రికులు ఫిర్యాదు చేశారని, దళారుల మాటలు విని మోసపోవద్దని, ఆన్‌లైన్ ద్వారానే దర్శన టోకెన్లు పొందాలని టిటిడి ఇఒ అనిల్ కుమార్ సింఘాల్ విజ్ఞప్తి చేశారు. శ్రీవారి యాత్రికుల విజ్ఞప్తి మేరకు అంగప్రదక్షిణం టోకెన్ల జారీ చేయడానికి గతంలో ఉన్న డిప్ విధానం కాకుండా, ఆన్‌లైన్‌లో ముందు వచ్చిన వారికి ముందు అనే పద్ధతిలో వచ్చే ఫిబ్రవరి నుండి టోకెన్లు కేటాయించనున్నట్లు చెప్పారు.

తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం జరిగిన డయల్ యువర్ ఇఒ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో నవంబరు 17 నుంచి 25 వరకు కార్తీక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. యాత్రికుల సూచనల మేరకు శ్రీవారి దర్శనాలకు సంబంధించి శ్రీవాణి, ఇతర దర్శన టోకెన్లు జారీ చేసే విధానంపై పరిశీలించి నివేదిక సమర్పించేందుకు టిటిడి బోర్డు ఒక కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలలో రూ.750 కోట్ల శ్రీవాణి ట్రస్ట్ నిధులతో ఐదు వేల భజన మందిరాల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. తిరుమల అటవీ ప్రాంతంలో రానున్న పదేళ్లలో జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు, పచ్చదనాన్ని పెంపొందించేందుకు టిటిడి నిర్ణయం తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఇఒ వి.వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఇంధన సామర్థ్య, సంరక్షణ కార్యక్రమాలు వేగం

- ఎపిఎస్ఇసిఎం సిఇఒ నాగలక్ష్మి ఆదేశం

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఇంధన సామర్థ్య, సంరక్షణ కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేసి, ఇంధన సామర్థ్య లక్ష్యాలను సాధించాలని అధికారులకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఎపిఎస్ఇసిఎం) సిఇఒ, జెన్‌కో ఎమ్‌డి ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. విజయవాడ విద్యుత్ సౌధలో శుక్రవారం ఎపిఎస్ఇసిఎం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంధన సామర్థ్యం రాష్ట్ర ఇంధన రంగ పురోగతిలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. భవనాలు, పరిశ్రమలు, మున్సిపాలిటీలు, వ్యవసాయం, రవాణా రంగాల్లో ఇంధన పొదుపు, సామర్థ్యానికి సంబంధించిన స్పష్టమైన ఫలితాల సాధనకు కృషి చేయాలని సూచించారు. అన్ని కార్యక్రమాలు రాష్ట్ర ఇంధన ఎఫిషియెన్సీ యాక్షన్ ప్లాన్, ఇంధన సంరక్షణ, సామర్థ్య విధానం–2023–28కు అనుగుణంగా అమలవ్వాలని చెప్పారు. పట్టణ, స్థానిక సంస్థల్లో ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ కచ్చితంగా అమలవ్వాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భవనాల నిర్మాణంలో ఇసిబిసి ప్రమాణాలు పాటించేలా ప్రోత్సహించాలన్నారు. ప్యాట్ కార్యక్రమం ద్వారా కార్బన్ క్రెడిట్ ట్రేడింగ్ వ్యవస్థకు మార్పు సులభతరం చేయాలని సూచించారు. ఎంఎస్ఎంఇ రంగంలో పైలట్ ప్రాజెక్టులు, ఎనర్జీ ఆడిట్లు, ఆధునిక పరికరాల వినియోగం ద్వారా ఇంధన సామర్థ్య పెంపు దిశగా ఎపిఎస్ఇసిఎం చేపట్టిన చర్యలను ఆమె అభినందించారు. పరిశ్రమల సంఘాలతో భాగస్వామ్య కార్యక్రమాల ద్వారా ఉత్పాదకత పెంపు, వ్యయ నియంత్రణ, కార్బన్ ఉద్గారాల తగ్గింపు లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. రిటైలర్లు, వినియోగదారులలో అవగాహన పెంచేందుకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, ఆర్థిక సంస్థలతో భాగస్వామ్య కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు. ఇంధన సామర్థ్యం, తక్కువ కార్బన్ ఉద్గారాలు, సుస్థిరాభివృద్ధి దిశగా దేశానికి రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

పంచాయతీల్లో మ్యాపింగ్ మాయ!

- 500కుపైగా ఆస్తులకు ఒకటే ఫోన్ నెంబర్
- కార్యదర్శుల నిర్లక్ష్య వైఖరిపై ఉన్నతాధికారుల సీరియస్
- పలువురిపై చర్యలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పంచాయతీల పరిధిలోని ఆస్తులకు ఫోన్ నెంబర్ మ్యాపింగ్‌లో కార్యదర్శుల తీరు అత్యంత ఘోరంగా ఉంది. కార్యాలయాల్లో కూర్చుని ఇష్టమొచ్చిన ఫోన్ నెంబర్లను ప్రజల ఆస్తులకు మ్యాపింగ్ చేస్తున్నారని, దీని వెనుక పెద్ద ఎత్తున అవినీతి పర్వం నడుస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు జిల్లాలో 547, పశ్చిమగోదావరి జిల్లాలో 409 పంచాయతీలు ఉన్నాయి. ప్రభుత్వం తీసుకొచ్చిన స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో పంచాయతీ పరిధిలోని ఆస్తుల వివరాలు నమోదు చేస్తున్నారు. ఆస్తులకు సంబంధిత యాజమానుల ఫోన్ నెంబర్లు మ్యాపింగ్ చేయాలి. గ్రామస్తులు పన్నులు చెల్లించిన వెంటనే సంబంధిత యజమాని ఫోన్‌కు మెసేజ్ వెళ్తుంది. పన్ను చెల్లించకపోతే హెచ్చరిక మెసేజ్ కూడా వెళ్లే విధానాన్ని ప్రభుత్వం తెచ్చింది. పంచాయతీ పరిధిలోని 500కుపైగా ఆస్తులకు ఒకే ఫోన్ నెంబర్ మ్యాపింగ్ చేయడంపై ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలోని అమరవరం, పెదవేగి మండలంలోని కూచింపూడి, ముసునూరు మండలంలోని ముసునూరు, టి.నరసాపురం మండలంలోని టి.నరసాపురం, చింతలపూడి మండలంలోని ప్రగడవరం పంచాయతీల్లో 500కుపైగా ఆస్తులకు ఒకే ఫోన్ నెంబర్ మ్యాపింగ్ చేసినట్లు తేలింది. చాలా పంచాయతీల్లో వందల సంఖ్యలో ఆస్తులకు ఒకే నెంబర్ మ్యాపింగ్ చేసినట్లు గుర్తించారు. దీంతో, గ్రామంలోని 50 శాతం ఆస్తులకు ఒకే ఫోన్ నెంబర్ మ్యాపింగ్ చేయడాన్ని తీవ్రంగా పరిగణించి కుక్కునూరు మండలం అమరవరం పంచాయతీ కార్యదర్శిని అధికారులు సస్పెండ్ చేశారు. మిగిలిన నాలుగు పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో నరసాపురం మండలంలోని వేములదీవి వెస్ట్, పెదమైనవానిలంక, తూర్పుతాళ్లు, కాళ్ల మండలం పెదఅమిరం పంచాయతీల్లో వందల ఆస్తులకు ఒకే ఫోన్ నెంబర్ మ్యాపింగ్ చేసినట్లు తేలింది. దీంతో, వేములదీవి వెస్ట్ పంచాయతీ కార్యదర్శిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. రాష్ట్ర స్థాయి పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు జిల్లాకు ఒక పంచాయతీ కార్యదర్శిని మాత్రమే ప్రస్తుతానికి సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది. మిగిలిన వారికి షోకాజ్ నోటీసులు, హెచ్చరికలతో సరిపెట్టారు. అత్యధిక పంచాయతీల్లో మ్యాపింగ్‌లో భారీ అవకతవకలు జరిగినట్లు చెబుతున్నారు. ప్రజల నుంచి వచ్చే పన్ను సొమ్మును స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా చెల్లింపులు చేయాలి. అలాకాకుండా కొంతమంది కార్యదర్శులు సొమ్ము తీసుకుని, సొంత ఖర్చులకు వాడుకుని తర్వాత తాపీగా ఆ సొమ్ము చెల్లించడం, లేదా దుర్వినియోగం చేయడం జరుగుతోందని ఆరోపణలువ వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే యజమానులకు మెసేజీలు వెళ్లకుండా ఉండేందుకు తప్పుడు ఫోన్ నెంబర్లు మ్యాపింగ్ చేసినట్లు చర్చ సాగుతోంది.

ఆడిట్, ఆర్థిక సంఘ నిధుల ఖర్చుల్లోనూ అవకతవకలే!

పంచాయతీ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రజాప్రతిధులతో కుమ్మక్కై పంచాయతీ సొమ్మును ఇష్టానుసారంగా దుర్వినియోగం చేస్తున్నట్లు అనేక ఫిర్యాదులు ఉన్నతాధికారులకు అందుతున్నాయి. పలు పంచాయతీల అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు కూడా తీసుకున్నారు. ఏటా పంచాయతీల నిధులు, ఖర్చులపై ఆడిట్ చేయించాలి. చాలామంది కార్యదర్శులు సకాలంలో ఆడిట్ చేయించలేదని సమాచారం. ఏలూరు జిల్లాలో పలు పంచాయతీల ఆడిట్‌లో లక్షల సంఖ్యలో అభ్యంతరాలు వచ్చినట్లు తెలుస్తోంది. దాదాపు రూ.200 కోట్ల సొమ్ముపై అభ్యంతరాలను ఆడిట్ అధికారులు లేవనెత్తినట్లు సమాచారం. ఆర్థిక సంఘం నిధులు, సంబంధిత ఖర్చులు ఇ–గ్రామస్వరాజ్‌లో నమోదు చేయాలి. కొందరు కార్యదర్శులు తమ బంధువుల, కుటుంబసభ్యుల పేర్లతో వెండర్ అకౌంట్లు తెరిచి సొమ్ము మళ్లిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీల్లో అవినీతిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప, బయటకు రావడం లేదు. ఎంపిడిఒలు, డిఎల్‌పిఒలు పంచాయతీ కార్యదర్శులకు కొమ్ముకాస్తున్నందునే అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ వ్యవస్థ గాడిన పడేనా అనే చర్చ జనాల్లో సాగుతోంది.



రుచిచూస్తా.. నాకూ అన్నం పెట్టండి

- విద్యార్థులతో కలిసి క్యూలో నిలబడిన కలెక్టర్

ప్రజాశక్తి–గంట్యాడ (విజయనగరం)

ఆయన జిల్లా మెజిస్ట్రేట్. మొత్తం జిల్లా యంత్రాంగాన్ని శాసించే ఉన్నతాధికారి. అయినప్పటికీ ఒక సామాన్య వ్యక్తిలా విద్యార్థులతోపాటు క్యూలో నిల్చొని భోజనం పట్టుకున్నారు. వారితో కలిసి నేలపైనే కూర్చొని భోజనం చేశారు. ఆయనే జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి. ఈ అరుదైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. కలెక్టర్ రామసుందర్ రెడ్డి శుక్రవారం గంట్యాడ మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ముందుగా తరగతి గదిలోకి వెళ్లి ఆంగ్ల ఉపాధ్యాయుడు డిజిటల్ స్క్రీన్ ద్వారా చెబుతున్న పాఠాన్ని విన్నారు. అదే పాఠాన్ని తాను కూడా కొంతసేపు విద్యార్థులకు బోధించారు. విద్యార్థులతో ముచ్చటించి వివిధ అంశాలపై ఆరా తీశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. తాను కూడా విద్యార్థులతో కలిసి క్యులైన్లో నిల్చొని పల్లెం పట్టుకుని భోజనం తీసుకున్నారు. ఆహారాన్ని రుచికరంగా తయారు చేయాలని, విద్యార్థులకు కడుపునిండా భోజనం పెట్టాలని ఆదేశించారు.


నేటి నుంచి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

రాష్ట్రస్థాయి అండర్–14 అథ్లెటిక్స్ పోటీలకు వజ్రపుకొత్తూరు మండలం పూండి– గోవిందపురం ముస్తాబైంది. ఎపి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నేటి నుంచి రెండు రోజుల పాటు ఈ క్రీడలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కన్వీనర్, స్థానిక పాఠశాల హెచ్‌ఎం కె.హరిబాబు తెలిపారు. అండర్–14 విభాగంలో బాలబాలికలకు నిర్వహించే పోటీలకు 13 ఉమ్మడి జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. రన్నింగ్ 100, 200, 400, 600 మీటర్లు, లాంగ్, హై జంప్, షాట్‌పుట్, డిస్కస్, 4 ఇంటూ 100 రిలే, 80 మీటర్స్ హర్డిల్స్ పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు జాతీయ స్థాయిలో ఆడేందుకు అర్హత సాధిస్తారని తెలిపారు.

రైతులంతా ప్రతిఘటించాలి

బర్ధమాన్‌లో ఏఐకెఎస్ భారీ సభలో వక్తల పిలుపు



బర్ధమాన్ సభలో మాట్లాడుతున్న విజూకృష్ణన్



బర్ధమాన్ : నూతన ఆర్థిక విధానాలు రైతుల జీవితాన్ని నాశనం చేస్తున్నాయని, వాటిని సంఘటితంగా ప్రతిఘటించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. పశ్చిమ బెంగాల్‌లోని బర్ధమాన్‌లో పశ్చిమ బంగా ప్రాదేశిక్ కృషక్ సభ (ఎఐకెఎస్ అనుబంధం) 28వ రాష్ట్ర సదస్సు సందర్భంగా శుక్రవారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. దొడ్డిదారిన రైతు వ్యతిరేక చట్టాలను మోడీ ప్రభుత్వం అమలు చేస్తోందని నేతలు విమర్శించారు. వాటిని తిప్పికొట్టేందుకు రైతులంతా పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజూకృష్ణన్, ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా, అమల్ హల్దార్, విప్లవ్ మజుందార్, రైతు నాయకులు సయ్యద్ హుస్సేన్ తదితరులు ప్రసంగించారు. త్రిపుర నుంచి ఎఐకెఎస్ సంయుక్త కార్యదర్శి పవిత్రాకర్ హాజరయ్యారు.

భాగల్పూర్ ప్రాజెక్టు అదానీకి అప్పగింతతో

బీహార్‌కు రూ. 62 వేల కోట్ల నష్టం

- నితీష్ సర్కార్‌పై బిజెపి నేత ఆర్‌కె సింగ్ విమర్శలు



ఆర్‌కె సింగ్

న్యూఢిల్లీ : బీహార్ భాగల్పూర్ జిల్లాలోని థర్మల్ విద్యుత్ ప్రాజెక్టును ఎన్‌డిఎ ప్రభుత్వం అదానీ గ్రూప్‌నకు అప్పగించడంతో ఆ రాష్ట్ర ఖజానాకు రూ.62 వేల కోట్ల నష్టం వాటిల్లిందని కేంద్ర మాజీ మంత్రి, బిజెపి సీనియర్ నాయకుడు ఆర్‌కె సింగ్ విమర్శించారు. తాను కేంద్ర విద్యుత్ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఈ ప్రాజెక్టుకు మూలధన వ్యయాన్ని రూ.24,900 కోట్లుగా అంచనా వేశారని, కానీ నితీష్‌కుమార్ ప్రభుత్వం అదానీకి రూ.15 కోట్ల మూల ధన వ్యయానికే మంజూరు చేసిందని తెలిపారు. తక్కువ మూల ధన వ్యయం కారణంగా విద్యుత్ యూనిట్‌కు దాదాపు రూ.2.72 ఖర్చవుతుందని, కానీ రాష్ట్ర ప్రభుత్వం యూనిట్‌కు రూ.4.16 చెల్లించడానికి అంగీకరించిందని సింగ్ తెలిపారు. దీని ఫలితంగా ఏడాదికి రాష్ట్ర ఖజానాపై సుమారు రూ.2,500 కోట్ల అదనపు భారం పడుతుందని, 25 ఏళ్ల కాంట్రాక్టు కాబట్టి దాదాపు రూ.62 వేల కోట్ల నష్టాన్ని ఖజానా భరించాల్సి వస్తోందని ఆర్‌కె సింగ్ వివరించారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపానని, కానీ ఎలాంటి స్పందన లేదని చెప్పారు. ఏడేళ్లపాటు కేంద్ర విద్యుత్ మంత్రిగా తనకున్న అనుభవంతో ఈ ప్రాజెక్టుపై సమీక్ష అవసరమని కచ్చితంగా చెప్పగలనని తెలిపారు. ఈ వివరాలన్నీ ఇటీవలే తాను తెలుసుకున్నానని, కాబట్టే ఇప్పుడే చెబుతున్నానని సింగ్ చెప్పారు. ఇంధన రంగ నిపుణులతో సంప్రదించిన తరువాతే ఈ అంశాన్ని లేవనెత్తుతున్నానని తెలిపారు.

పిల్లలకు సోషల్ మీడియా నిషేధం..

- డెన్మార్క్ ప్రభుత్వం నిర్ణయం
- 15 సం॥ లోపు వారికి అనుమతి నిరాకరణ

కొపెన్‌హెగెన్ : డెన్మార్క్ ప్రభుత్వం 15 సంవత్సరాలలోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించింది. దీనికి సంబంధించిన నివేదికను ఆ దేశ డిజిటలైజేషన్ మంత్రిత్వ శాఖ శుక్రవారం విడుదల చేసింది. సోషల్ మీడియా పిల్లల మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. నిద్రకు అంతరాయం కలుగుతుందని, ఏకాగ్రత కోల్పోతున్నారని తెలిపింది. ఆన్‌లైన్ మోసాలకు పిల్లలు బలైపోతున్నారని అధికారులు వెల్లడించారు.. డిజిటలైజేషన్ మంత్రి మీడియాతో మాట్లాడుతూ సోషల్ మీడియా పిల్లల బాల్యాన్ని, వారి సమయాన్ని, వారి ఆనందాన్ని దోచుకుంటోందని, దానికి తాము ముగింపు పలుకుతున్నామని ప్రకటించారు. ఆన్‌లైన్ ప్రపంచంలో హానికరమైన కంటెంట్, వాణిజ్య ప్రభావాలు తీవ్రమైపోయాయని, వాటి నుండి యువతను రక్షించడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన కొత్త మార్గదర్శకాల్లో యుట్యూబ్, స్నాప్‌చాట్, ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్ వంటి దిగ్గజ సంస్థలపై నియంత్రణలు ఉన్నాయి. అయితే 13 సంవత్సరాలు దాటిన వారికి తల్లిదండ్రుల సమక్షంలో అనుమతించనున్నారు. అదీ పరిమిత కాలం వరకే. కొన్ని నెలల క్రితం ఆస్ట్రేలియా ఇటువంటి నిర్ణయాన్నే తీసుకుంది. యూరోపియన్ యూనియన్ దేశాల్లో సోషల్ మీడియాను వయోపరిమితి ఆధారంగా నియంత్రించిన మొదటి దేశంగా డెన్మార్క్ నిలిచింది. ఈ నిర్ణయంతో పిల్లల్లో మానసిక ఆరోగ్యం, వారి అభివృద్ధికి, విచ్చలవిడిగా పెరిగిపోతున్న సోషల్ మీడియా నియంత్రణకు దోహదపడుతుందని పలువురు భావిస్తున్నారు...


ఎస్ఐఆర్‌పై 11న అత్యవసర విచారణ : సుప్రీం

న్యూఢిల్లీ : బీహార్‌లో ప్రారంభించిన తొలిదశ, దేశవ్యాప్తంగా ప్రారంభమైన రెండో దశ ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర పరిశీలన (ఎస్ఐఆర్)లపై ఈ నెల 11న విచారణ జరుపుతామని, పిటిషనర్ల వాదనలను వింటామని సుప్రీంకోర్టు శుక్రవారం తెలిపింది. జూన్ 24న బీహార్ శాసనసభ ఎన్నికలకు ముందు ప్రారంభించిన, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, పుదుచ్చేరి సహా 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 51 కోట్ల మంది ఓటర్లకు సంబంధించి ఈ నెలలో ప్రారంభమైన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) అమలు చట్టబద్ధతపై వివరణాత్మక వాదనలపై విచారణ అత్యవసరమని నిర్ణయించింది. న్యాయమూర్తులు సూర్యకాంత్, జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం న్యాయవాదులు ప్రశాంత్ భూషణ్, నేహా రాఠీ మౌఖికంగా ప్రస్తావించిన తర్వాత ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఈ నెల 4న ఎస్ఐఆర్ కేసు జాబితా చేయబడినప్పటికీ, రాజ్యాంగ ధర్మాసనంలోని ఇద్దరు న్యాయమూర్తులు మరో కేసును విచారించాల్సి ఉండటంతో హాజరు కాలేకపోయారు. తమిళనాడులోని ద్రావిడ మున్నేట్ర కజగం (డిఎంకె) తరపున న్యాయవాది వివేక్ సింగ్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ నేతృత్వంలోని బెంచ్ ముందు ఎస్ఐఆర్ పిటిషన్‌ను ప్రస్తావించారు. ఈ నెల 11న జాబితాలో ఇతర పిటిషన్లతోపాటు ఈ పిటిషన్‌పైనా రాజ్యాంగ ధర్మాసనం ఎదుట విచారణ జరుగుతుందని ధర్మాసనం తెలిపింది.

సమగ్ర అధ్యయనంతోనే పరిష్కారం

- అంతర్జాతీయ వ్యవసాయ సదస్సులో పినరయి విజయన్





ఫాస్ ఆధ్వర్యాన అంతర్జాతీయ వ్యవసాయ సదస్సులో వర్చువల్‌గా ప్రసంగిస్తున్న పినరయి విజయన్

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

ప్రపంచంలో వ్యవసాయ రంగ సమస్యలపై సమగ్రంగా అధ్యయనం చేసినప్పుడే పరిష్కార మార్గాలను కనుగొనగలమని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. ఆ విధంగా అధ్యయనం చేసేందుకు, పరిష్కారాలను కనుగొనేందుకు ఈ అంతర్జాతీయ సదస్సు ఎంతగానో దోహదం చేస్తుందని అన్నారు. ఫౌండేషన్ ఫర్ అగ్రేరియన్ స్టడీస్ (ఫాస్) ఆధ్వర్యాన అంతర్జాతీయ వ్యవసాయ సదస్సు కేరళలోని తిరువనంతపురంలో గురువారం సాయంత్రం ప్రారంభమైంది. ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులపై చర్చిస్తున్న ఈ సదస్సును పినరయి విజయన్ వర్చువల్‌గా ప్రారంభించారు. భారతదేశం, పలు దేశాల్లో ముఖ్యపాత్ర వహిస్తున్న వ్యవసాయ రంగం అభివృద్ధి చాలా అవసరమని అన్నారు. ప్రజలకు తిండినందించే వ్యవసాయరంగం ప్రపంచీకరణ, సరళీకరణ విధానాల వల్ల తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటోందన్నారు. ఈ సదస్సు వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న సమస్యలు లోతుగా చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషిస్తుందని ఆయన ఆకాంక్షించారు. సదస్సు ప్రారంభ కార్యక్రమం ప్లీనరీ సెషన్‌కు కన్వీనర్, కేరళ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ వికె రామచంద్రన్ అధ్యక్షత వహించారు. సదస్సులో ప్రముఖ పాత్రికేయులు ఎన్ రామ్ సావనీర్ ఆవిష్కరించి సీనియర్ రైతు నాయకులు ఎస్ రామచంద్రన్ పిళ్లైకు అందించారు. సర్వేల రిపోర్టులు, పరిశోధన పత్రాలు త్వరగా ప్రజలకు చేరాలని ఎన్ రామ్ ఆకాంక్షించారు. అత్యంత వేగవంతమైన ఆధునిక యుగంలో ఆలస్యం నష్టాలకు దారితీస్తుందన్నారు.

వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర అమోఘమని, కానీ వారు తీవ్రంగా నిర్లక్ష్యం చేయబడుతున్నారని మహిళా ఉద్యమ నేత బృందాకరత్ పేర్కొన్నారు. ఆదివాసీ, దళిత మహిళలు అన్యాయానికి గురవుతున్నారని అన్నారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి, పూర్వ ప్రధాన కార్యదర్శి ప్రకాష్ కరత్, ఎఐకెఎస్ అధ్యక్షులు అశోక్ ధావలే, ఎఐఎడబ్ల్యుయు అధ్యక్షులు ఎ విజయ రాఘవన్, ప్రధాన కార్యదర్శి బి వెంకట్, ప్రొఫెసర్ వెంకటేష్ ఆత్రేయ, ప్రొఫెసర్ మధురా స్వామినాథన్, ప్రొఫెసర్ ఎస్ మహేంద్రదేవ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. దేశంలోని 15 రాష్ట్రాలతో సహా వియత్నాం, చైనా, బ్రెజిల్ పోర్చుగీస్ సహా 25 దేశాల నుండి ప్రొఫెసర్లు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయరంగ ప్రముఖులు పాల్గొన్నారు. ఆదివారం వరకు 25 అంశాలపై ప్రముఖులు పత్రాలు సమర్పించనున్నారు. చెరకు, వరి, ఆక్వా, కొబ్బరి, పాడి, కూరగాయలు, అరటి, కోకో, పొగాకు, మొక్కజొన్న, పండ్ల తోటలు తదితర పంటల్లో రైతాంగ సమస్యలపై ఈ పత్రాల్లో చర్చించనున్నారు. ప్రధానంగా సన్న, చిన్నకారు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల స్థితిగతులు, ఆహార భద్రత, పెరుగుతున్న అసమానతలు ఈ పత్రాల్లో చోటుచేసుకుంటాయని ఫాస్ డైరక్టర్లు, నిర్వాహకులు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ, పర్యావరణ పరిస్థితుల్లో వస్తున్న అసాధారణ మార్పులు, వ్యవసాయరంగంపై చూపుతున్న తీవ్ర ప్రభావం, వస్తున్న దుష్ఫలితాలు తదితర అంశాలపైనా చర్చించనున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి బి బలరాం, తెలంగాణ నుంచి సాగర్, అరిబండి ప్రసాద్, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

వందేమాతర గేయం అన్ని తరాలకు స్ఫూర్తి

- 150 ఏళ్ల స్మారకోత్సవాల్లో ప్రధాని మోడీ



వందేమాతరం స్టాంప్‌ను విడుదల చేస్తున్న మోడీ

న్యూఢిల్లీ: వందేమాతర గీతం ఒక స్వప్నం, ఒక సంకల్పం, అదొక స్ఫూర్తిమంత్రమని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. శుక్రవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో వందేమాతర గేయం 150 ఏళ్ల స్మారకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోడీ ప్రసంగిస్తూ ఒకే లయ, స్వరం, భావంతో వందేమాతర గీతాలాపన హృదయాన్ని స్పందింపజేస్తుందని, స్మారకోత్సవాలు దేశ ప్రజలకు ప్రేరణ ఇస్తాయని అన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమానికి వందేమాతరం స్ఫూర్తిని అందించిందని తెలిపారు. దేశంలో జాతీయ ఐక్యతను, జాతీయతా భావనలను పెంపొందించడంలో అది కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ ఏడాది నవంబరు 7 నుంచి 2026 సంవత్సరం నవంబరు 7 వరకు దేశవ్యాప్తంగా 'వందేమాతరం' స్మారకోత్సవాలు ఘనంగా జరుగుతాయని ప్రధాని వెల్లడించారు. 'వందేమాతరం' 150 వసంతాలను పూర్తి చేసుకున్న సందర్భంగా స్మారక స్టాంపు, నాణెంను ఆయన విడుదల చేశారు

అరెస్ట్ సమయంలో లిఖితపూర్వకంగా కారణాలు తెలపాల్సిందే....

- లేకుంటే ఆరెస్టు, రిమాండ్ చట్ట విరుద్ధం : సుప్రీం

న్యూఢిల్లీ : పోలీసులు ఆరెస్టు చేసే సమయంలో దానికిగల కారణాలను తప్పనిసరిగా లిఖితపూర్వకంగా తెలపాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. గురువారం దీనికి సంబందించిన తీర్పును ధర్మాసనం వెలువరించింది. అరెస్ట్‌కు గల కారణాలను అరెస్టు చేసిన వ్యక్తికి తనకి అర్థం అయ్యే భాషలో లిఖితపూర్వకంగా ఇవ్వకుండా అదుపులోకి తీసుకోవడం, రిమాండ్‌కు పంపడం చట్ట విరుద్ధమని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది.. " అరెస్టు చేసిన వ్యక్తికి అర్థంకాని భాషలో తెలపటం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 22 ప్రకారం వ్యతిరేకం, అర్థం కాని భాషలో తెల్పడం రాజ్యాంగ రక్షణను భ్రాంతిగా మారుస్తుందని, అలాగే ఆర్టికల్ 21, 22 ప్రకారం వ్యక్తిగత స్వేచ్ఛను ఉల్లంఘించడమేనని " కోర్టు వ్యాఖ్యానించింది. దీని వల్ల దర్యాప్తు సంస్థలకు ఉపయోగం జరుగుతుందని తెలిపింది.

ముంబయిలో గతేడాది శివసేన (షిండే గ్రూపు) నాయకుడు రాజేష్ షా కొడుకు మిహిర్ షా మద్యం సేవించి బిఎండబ్లూ కారుతో మహిళను ఢీకొట్టారు. దీంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. ఈ కేసులో ముంబాయి కోర్టు నిందితుడైన పిటీషనర్ అరెస్ట్‌లో విధానపరమైన లోపాలను గుర్తించింది. పోలీసులు ఆరెస్టుకు సంబంధించిన నిబంధనలను పాటించలేదని, రాజకీయ నాయకుడి కొడుకు కావడంతో ఉద్దేశపూర్వంగా చేయలేదా అనే అనుమానాలను వ్యక్తం చేసింది. నేర తీవ్రత , కస్టడీ నుండి పిటీషనర్ తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని భావించి కోర్టు దాన్ని అక్రమ అరెస్టుగా ప్రకటించడానికి నిరాకరించింది. అనంతరం పిటీషనర్ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ గవాయి, జస్టిస్ ఆగస్టీన్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం అరెస్టుకు గల కారణాలను అరెస్టయిన వ్యక్తికి తెలపటం ఆర్టికల్ 22(1) ప్రకారం ప్రాథమిక హక్కు అని, ఆర్టికల్ 21 వ్యక్తి స్వేచ్ఛకు హామీనిస్తుందని స్పష్టం చేసింది. అరెస్టు అయిన వ్యక్తి బెయిల్‌కు దరఖాస్తు చేసుకోవడానికి, న్యాయ సలహా తీసుకోవడానికి వీలు కల్పిస్తూ తీర్పు వెల్లడించింది.

రాజ్యాంగంపై బిజెపి, ఇసి దాడి

- ఓట్ల చోరీతోనే మోడీ ప్రధాని అయ్యారు
- రాహుల్ గాంధీ విమర్శలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యాంగంపై ఎన్నికల సంఘం, బిజెపి కలిసి దాడి చేస్తున్నాయని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. దేశంలో ఎన్నికలను కమలం పార్టీ దొంగతనం చేస్తోందని, ఓట్లు చోరీ చేయడంతోనే నరేంద్ర మోడీ ప్రధాని అయ్యారని అన్నారు. శుక్రవారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. బిజెపి ఎన్నికలను ఎలా దొంగిలిస్తుందనే విషయాన్ని దేశ యువతకు, ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఆధారాలతో చూపిస్తుందని అన్నారు. ఓట్ల చోరీపై ఇప్పటి వరకు బిజెపి, ఇసి స్పందించలేదని విమర్శించారు. ఓట్ల చోరీపై తమ దగ్గర చాలా సమాచారం ఉందని తెలిపారు. హర్యానాలో హోల్‌సేల్‌గా ఓట్ల చోరీ జరిగిందన్నారు. బీహార్‌లోనూ ఇదే పునరావృతం కాబోతోందని చెప్పారు. మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, హర్యానా, గుజరాత్‌లోనూ ఇదే జరిగిందని వివరించారు. ఓట్ల చోరీపై బిజెపి ఆత్మరక్షణలో పడిందే తప్ప వ్యతిరేకించట్లేదని చెప్పారు. ఓట్ల దొంగతనం వెలికితీసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. తమ వద్ద చాలా సమాచారం ఉందని, తాము ఈ ప్రక్రియను కొనసాగిస్తామని తెలిపారు.

ప్రధాన సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు బిజెపి యత్నం

బీహార్‌లోని బంకాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. ఢిల్లీలో తమ ఓటు హక్కును వినియోగించుకున్న బిజెపి నాయకులు బీహార్ అసెంబ్లీ ఎన్నికల మొదటి దశలో కూడా ఓటు వేశారని విమర్శించారు. 'హర్యానాలోని రెండు కోట్ల మంది ఓటర్లలో 29 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నారు. మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, హర్యానాల్లో బిజెపి 'ఓటు చోరీ'లో మునిగిపోయింది. ఇప్పుడు వారు బీహార్‌లోనూ దానిని పునరావృతం చేయడానికి ప్రయత్నిస్తున్నారు' అని అన్నారు.'ప్రధాన సమస్యల నుండి దృష్టి మళ్లించడానికి' సోషల్ మీడియా రీల్స్ చేయడానికి యువతను ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని విమర్శించారు. 'రీల్స్ 21వ శతాబ్దపు వ్యసనం' అని ఆయన అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

మీడియాను నియంత్రిస్తోన్న బిజెపి

భాగల్పూర్‌లో మరో ఎన్నికల ర్యాలీలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. బీహార్‌లోని రైతులు, కార్మికులు, నేత కార్మికులకు బ్యాంకుల నుండి రుణాలు అందడం లేదని, వారి రుణం మాఫీ కావడం లేదని విమర్శించారు. బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం ఎల్లప్పుడూ కొన్ని కార్పొరేట్ సంస్థల రుణాలను మాఫీ చేస్తుందని పేర్కొన్నారు.



ప్రధానమంత్రిని 24 గంటలు చూపించడానికి టివి ఛానెళ్లకు బిజెపి డబ్బు చెల్లిస్తుందని, మీడియాను నియంత్రిస్తోందని చెప్పారు. 'హర్యానాలో చోరీకి సర్కార్' (దొంగతనంతో ఏర్పడిన ప్రభుత్వం) అని నేను పూర్తి నమ్మకంతో చెప్పగలను. ఇది ఆపరేషన్ సర్కార్ చోరీ. ఒక బ్రెజిల్ మోడల్ ఫొటోతో 22 నకిలీ ఓట్లు సృష్టించినా ఎన్నికల సంఘం ఎందుకు కనిపెట్టలేకపోయింది? ఒకే ఇంట్లో 501 మంది ఓటర్లు ఉన్నట్లు చూపినా గుర్తించలేకపోయింది? బీహార్‌లోనూ ఇలా ఓట్ల చోరీ జరిగే ప్రమాదం లేకపోలేదు' అని ఆయన పేర్కొన్నారు.

అసాధారణ విపత్తుతో సర్వం కోల్పోయారు

(మొదటిపేజీ తరువాయి)

తెలుసుకున్నారు. ముంచెత్తిన వరద వల్ల తడిచి ముద్దయిన బియ్యాన్ని, జరిగిన నష్టాన్ని పరిశీలించారు. ఊహించని వరద కళత్తూరులో సృష్టించిన విధ్వంసాన్ని చూసి నిర్ఘాంతపోయారు. అనంతరం మీడియాతో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాయల చెరువు ఘటన అసాధారణమైనదని తెలిపారు. ఊహకందని నష్టం వాటిల్లిందన్నారు. గ్రామంలోని ప్రతి కుటుంబం... గొడ్డూ, గోదా, ఒకటేంటి సర్వం కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీడీ కార్మికులకు, మత్స్యకారులకు అపార నష్టం వాటిల్లిందని తెలిపారు. బాధిత కుటుంబాలకు తక్షణసాయంగా రూ.5 లక్షలు, ఆపైబడి ఆస్తి నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాయలచెరువు విపత్తుతో అప్రమత్తమై యుద్ధప్రాతిపదికన అధికార యంత్రాంగం సహాయక చర్యలు చేపట్టడంపై ప్రశంసించారు. అదే సమయంలో గ్రామానికి వచ్చిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌ను వి.శ్రీనివాసరావు కలిశారు. గ్రామం పూర్తిగా కోలుకునే వరకు సహాయక చర్యలు కొనసాగించాలని కోరారు. బాధితులకు రెండు సెంట్ల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అటవీ భూముల వివాదాన్ని పరిష్కరించి ఒక్కో దళిత కుటుంబానికి రెండు ఎకరాల భూమి ఇవ్వాలని కోరారు.

బాధిత కుటుంబాలకు చీరలు పంపిణీ

అనంతరం ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు), ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు చీరలను వి.శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, దాసరి జనార్ధన్, రాజేశ్వరి, సరళ, జానమ్మ, శంకరయ్య, లక్ష్మయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గగన కల్లోలం

(మొదటిపేజీ తరువాయి)

కలుగుతోంది. అనేక విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఎయిర్‌పోర్టు టెర్మినల్ల లోపల, బోర్డింగ్ గేట్ల వద్ద భారీ సంఖ్యలో ప్రయాణికులు క్యూలో వేచిఉన్నారు. ఢిల్లీలో కొన్ని రోజులుగా విమాన ప్రయాణాలకు తరచూ అంతరాయం కలుగుతోంది. విమాన నావిగేషన్ వ్యవస్థపై ప్రభావితం చూపే జిపిఎస్ స్పూఫింగ్ ఇందుకు కారణమనే అనుమానాలున్నాయి. ఊహించని విధంగా ఎయిర్ ట్రాఫిక్ పెరగడంతో అనేక విమానాలను దారి మళ్లించాల్సి వస్తోంది. నావిగేషన్ వ్యవస్థను ప్రభావితం చేసి నకిలీ జిపిఎస్ ద్వారా విమానాలను దారి మళ్లించే ప్రక్రియను జిపిఎస్ సిగ్నల్ స్పూఫింగ్‌గా వ్యవహరిస్తారు. నిజమైన శాటిలైట్ సిగ్నల్స్‌ను అడ్డుకొని ఆ స్థానంలో నకిలీ సంకేతాలను పంపి జిపిఎస్ రిసీవర్‌ను తప్పుదోవ పట్టిస్తాయి. ఫలితంగా.. ప్రస్తుతమున్న ప్రదేశం, సమయాన్ని తప్పుగా చూపించేలా చేస్తాయి. పౌర విమానాలే లక్ష్యంగా అంతర్జాతీయ రూట్‌లలో ఇటీవల ఇలాంటివి చోటుచేసుకుంటున్నాయి. ఇలాంటి ఘటన మనదేశంలోనూ వెలుగుచూడ్డం ఆందోళన కలిగించే విషయం.

సైబర్ దాడే కారణమని అనుమానాలు?

ఈ సమస్యకు సైబర్ దాడే కారణమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎటిసి ఆటోమేషన్ వ్యవస్థలోకి మాల్‌వేర్ చొరబడిందని, దీంతో ఆటోమేషన్ వ్యవస్థలో వైఫల్యం చోటుచేసుకుందని సంబంధిత రంగానికి చెందిన నిపుణులు భావిస్తున్నారు. ఈ కోణంలో ఇప్పటికే దర్యాప్తు ప్రారంభమైందని, మాల్‌వేర్ చొరబాటును సాఫ్ట్‌వేర్ సాయంతో గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. సైబర్‌దాడి జరిగిందనే వాదనను ప్రభుత్వ అధికారులు ఖండిస్తున్నారు.

ఆ ప్రమాదంలో పైలట్ తప్పిదం లేదు

- ఎయిరిండియా దుర్ఘటనపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం దేశం మొత్తాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి ప్రమాదంలో మరణించిన ప్రధాన పైలట్ సుమీత్ సభర్వాల్ తండ్రి పుష్కరాజ్ సభర్వాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈ క్రమంలో కేంద్రం, డిజిసిఎలకు నోటీసులు జారీ చేసింది.

ఎయిరిండియా ప్రమాదంలో మృతి చెందిన 260 మందిలో కెప్టెన్ సుమీత్, కో-పైలట్ క్లైవ్ కుందర్‌లు కూడా ఉన్నారు. ఈ కేసును న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు కోరుతూ.. సుమీత్ తండ్రి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రమాదానికి గల కారణాన్ని నిర్ధారించడంతోపాటు ఘటనపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేస్తూ ఆయన పిటిషన్ దాఖలు చేశారు. ఈ విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఈ ప్రమాదం జరగడం దురదష్టకరం. మీ కుమారుడిని నిందిస్తున్న భారాన్ని మీరు మోయకూడదు. అతడిని ఎవరూ నిందించలేరు. ఈ ప్రమాదానికి పైలట్‌ల తప్పిదమే కారణమని దేశంలో ఎవరూ విశ్వసించడం లేదు. ఆయనపై అలాంటి ఆరోపణలు రాలేదు. ప్రమాదంపై జరిగిన ప్రాథమిక దర్యాప్తులో ఇద్దరు పైలట్ల మధ్య సంభాషణ మాత్రమే బయటకు వచ్చింది' అని పేర్కొంది.

ఈ క్రమంలోనే పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కోరుతూ కేంద్రం, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్‌తో పాటు ఇతర అధికారులకు నోటీసులు జారీ చేసింది. దీనిపై తదుపరి విచారణ నవంబరు 10కి వాయిదా వేసింది.

కరేబియన్ సముద్రంలో కొనసాగుతున్న అమెరికా దాడులు

- ఇప్పటివరకు 70 మంది మృతి, 18 నౌకలు ధ్వంసం
- మత్స్యకారులు, సాధారణ పౌరులే బలి



వాషింగ్టన్ : కరేబియన్ సముద్ర జలాల్లో అమెరికా వైమానిక దాడులను కొనసాగిస్తుంది. వెనుజులా సరిహద్దు సముద్ర తీర ప్రాంతంలో బోటుపై దాడి చేశామని అమెరికన్ రక్షణ కార్యదర్శి హెగ్సేత్ ప్రకటించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 17వ సారి అమెరికా వైమానిక దళాలు మాదకద్రవ్యాల అక్రమ రవాణా చేస్తున్న బోటుపై దాడి చేశాయని, దీనిలో ముగ్గురు మృతిచెందారని తెలిపారు. ఇప్పటివరకు జరిపిన దాడుల్లో 70 మంది మరణించారని, 18 నౌకలను ధ్వంసం చేశామని పేర్కొన్నారు..హెగెత్ ఈ దాడికి సంభందించిన వీడియోను ఆయన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. దానిలో ట్రంప్ ఆదేశాలతో దాడులు చేశామని, అమెరికన్ ప్రజలపై విషప్రయోగం ఆగే వరకూ దాడులు కొనసాగుతాయన్నారు. తాజా దాడిలో ధ్వంసమైన బోటును ఉగ్రవాద సంస్థ (డిటిఒ) నడుపుతుందని, నార్కో ఉగ్రవాదులను అంతం చేస్తామంటూ రాసుకొచ్చారు. మరోవైపు అధ్యక్షుడు ట్రంప్ దాడులను సమర్ధించారు. అంతర్జాతీయ ఉగ్రవాద ముఠాలు వీటిని నడుపుతున్నాయన్నారు. సైనిక చర్యను మాదకద్రవ్య వ్యాపారులతో సాయుధ సంఘర్షణగా అభివర్ణించారు. సెప్టెంబర్‌లో దాడులను ప్రారంభించిన అమెరికా కాంగ్రెస్ నుండి ఎటువంటి అనుమతి తీసుకోలేదు. గత నెలలో వెనుజులాలో రహస్య కార్యకలాపాలకు సిఐఎకి ట్రంప్ అనుమతించిన సంగతి తెలిసిందే. దీనిపై ఒక టీవి ఇంటర్వ్యూలో వెనుజులాలో ప్రభుత్వాన్ని మార్చాలనుకుంటున్నారా అన్న ప్రశ్నకు పొంతన లేని సమాధానం ఇచ్చారు.

అంతర్జాతీయ చట్టాలను అతిక్రమిస్తున్నారు : మధురో

అక్రమ రవాణా పేరుతో దాడులు చేస్తూ అంతర్జాతీయ చట్టాలను అమెరికా అతిక్రమిస్తుందని వెనుజులా అధ్యక్షుడు మధురో విమర్శించారు. దాడుల్లో అమాయకులైన మత్స్యకారులు, సాధారణ పౌరులు మరణిస్తున్నారని తెలిపారు. అమెరికా బాంబర్లు తమ దేశ సమీపంలో బలప్రదర్శనలు చేస్తున్నాయన్నారు. ట్రంప్ వెనుజులాను సామంత రాజ్యంగా చేసుకోవాలని అనుకుంటున్నారని, అది సాధ్యం కాదని హెచ్చరించారు. వెనుజులాలో మాదకద్రవ్యాల సాగు లేదని మరోసారి స్పష్టం చేశారు. ఇప్పటివరకూ మాదకద్రవ్యాలు అక్రమంగా రవాణా అవుతున్నాయనే దానికి, అంతర్గత ముప్పు వంటి ఆరోపణలకు అమెరికా ఎటువంటి ఆధారాలను బహిర్గతం చేయలేదు.

రంగంలోకి దిగిన రష్యా

అమెరికా చర్యలకు ప్రతిగా రష్యా కూడా రంగంలోకి దిగింది. వెనెజులాకు వైమానిక రక్షణ వ్యవస్థలను సరఫరా చేసింది. పంత్‌సర్-ఎస్1ఎస్, బక్-ఎం2ఇఎస్, ఎస్-300 విఎంఎస్ వంటి రష్యా వైమానిక రక్షణ వ్యవస్థలు వెనెజులా అమ్ముల పొదిలో చేరాయి. రష్యా నిర్మిత సుఖోయ్ ఫైటర్ జట్లకు మరమ్మతులు, రాడార్ వ్యవస్థలకు అప్‌గ్రేడ్‌లు, క్షిపణి వ్యవస్థల డెలివరీలతోసహా సైనిక సహాయం కోసం మధురో ఇప్పటికే రష్యాకు విజ్ఞప్తి చేశారు. ఉద్రిక్తతలు పెరగకుండా వెనిజులాకు సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు రష్యా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి మరియా జఖరోవా శుక్రవారం చెప్పారు. రష్యాకు చెందిన రవాణా విమానాలు వెనెజులాలో చక్కర్లు కొడుతున్నాయి. రష్యా చట్టసభ సభ్యులు బహిరంగంగానే మదురోకు మద్దతు ప్రకటించారు.

మిత్ర దేశాల బాసట

వెనెజులాకు ప్రాంతీయ భాగస్వామ్య దేశాలు బాసటగా నిలుస్తున్నాయి. ఓడలో ప్రయాణిస్తున్న తన జాతీయులు అమెరికా వైమానిక దాడిలో మరణించడంపై కొలంబియా ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. తన భూభాగం సమీపంలో అమెరికా చేపడుతున్న సైనిక చర్యలపై మెక్సికో అభ్యంతరం వ్యక్తం చేసింది. వెనెజులా చుట్టూ అమెరికా సైనిక దళాల మోహరింపును బ్రెజిల్ అధ్యక్షుడు లూలా నిరసించారు.

ఆధారాలు చూపని అగ్రరాజ్యం

వెనెజులా వద్ద అపారమైన చమురు నిల్వలు ఉన్నాయి. కీలక సముద్ర మార్గాలపై దాని ఆధిపత్యం కొనసాగుతోంది. దీనిని జీర్ణించుకోలేని అమెరికా ఎలాగైనా వెనెజులాను తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని యోచిస్తోంది. అందుకే మాదక ద్రవ్యాల రవాణాపై దాడుల పేరుతో కయ్యానికి కాలు దువ్వుతోంది. వాస్తవానికి ఆ ఓడల్లో మాదక ద్రవ్యాల రవాణా జరుగుతోందని చెప్పడానికి అమెరికా వద్ద ఎలాంటి ఆధారాలు లేవు..

మెక్సికోపై కూడా...

అంతర్జాతీయ జలాల్లో ఇలాంటి దాడులు జరపడానికి చట్టబద్ధమైన ప్రాతిపదిక ఏమైనా ఉన్నదా అని డెమొక్రాట్లే కాకుండా రిపబ్లికన్లు సైతం ట్రంప్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. అమెరికా దళాలు చంపుతున్నది మాదక ద్రవ్యాల రవాణా దారులను కాదని, వారంతా మత్స్యకారులని లాటిన్ అమెరికాలోని మృతుల కుటుంబ సభ్యులు వాపోయారు. దాడులను వెంటనే ఆపాలని ఐరాస మానవ హక్కుల అధిపతి వోల్కర్ ట్రంక్ గత వారం అమెరికాను కోరారు. అది ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. మాదక ద్రవ్యాలపై పోరాటం పేరుతో తాజాగా మెక్సికోకు అమెరికా దళాలను, ఇంటెలిజెన్స్ అధికారులను పంపాలని ట్రంప్ యోచిస్తున్నారు.

డయాబెటిస్, ఒబెసిటీ ఉంటే అమెరికా వీసా కష్టమే!

వాషింగ్టన్: అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వలసదారులపై కఠిన నిబంధనలతో ట్రంప్ బెంబేలెత్తిస్తున్నారు. హెచ్1 బి వీసా, గ్రీన్‌కార్డులపై ఆంక్షలు పెట్టిన అమెరికా అధ్యక్షుడు తాజాగా మరో షాక్ ఇచ్చేలా మార్గదర్శకాలు జారీ చేసినట్లు సమాచారం. సమాజంలోని ప్రజల జీవనశైలి మారటంతో డయాబెటిస్, ఒబెసిటీ బారిన పడుతున్నారని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఇలాంటి వ్యాధులున్న వారి వీసాలను తిరస్కరించేలా కొత్త నిబంధనలను రూపొందించారు. ఈ మేరకు అమెరికా ఎంబసీలు, కాన్సులర్ కార్యాలయాలకు యుఎస్ విదేశాంగ శాఖ తాజాగా మార్గదర్శకాలు జారీ చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

ఆరోగ్యస్థితిపై ఇమ్మిగ్రేషన్ అధికారుల పరిశీలన

సాధారణంగా అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారి ఆరోగ్య స్థితిని ఇమ్మిగ్రేషన్ అధికారులు పరిశీలిస్తారు.

టిబి వంటి అంటువ్యాధులు ఉన్నాయో లేదో స్క్రీనింగ్ చేస్తారు. అయితే ఈ నిబంధనలను తాజాగా సవరించారు. మరిన్ని వ్యాధులను ఈ జాబితాలో చేరుస్తూ మార్గదర్శకాలు రూపొందించారు. అంటే.. ఇకపై వీసా కోసం దరఖాస్తు చేసుకున్న వలసదారుల మెడికల్ హిస్టరీపై అధికారులు మరింత నిఘా పెట్టనున్నారు. వారు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారా? వారిని అమెరికాలోకి అనుమతిస్తే ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడనుందా? అనే అంశాలను పరిగణనలోకి తీసుకుని వీసా జారీపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ వనరులపై అదనపు భారం పడే అవకాశమున్న దరఖాస్తుదారులను అమెరికాలోకి రానివ్వకుండా వీసాను తిరస్కరించేలా నిబంధనలను కఠినతరం చేసినట్లు సమాచారం.

అంతేకాదు.. ఒకవేళ వలసదారులు అమెరికా ప్రభుత్వ సాయం లేకుండా వైద్య చికిత్సలను సొంతంగా భరించగలరా లేదా? అన్నది కూడా నిర్ధారించుకోవాలని వీసా అధికారులను ఆదేశించారు.

ఇక, కుటుంబసభ్యుల ఆరోగ్యాన్ని కూడా పరిశీలించాలని స్పష్టం చేశారు. అయితే, ఈ వార్తలపై అమెరికా విదేశాంగ శాఖ స్పందించలేదు. దీంతో ఈ రూల్స్ అమల్లోకి వచ్చాయా లేదా అన్న దానిపై స్పష్టత లేదు. ఇప్పటికే వలసదారులకు సంబంధించి అమెరికా యంత్రాంగం కఠిన విధానాలను అమలు చేస్తోన్న సంగతి తెలిసిందే. విదేశీ విద్యార్థులు, ఎక్స్ఛేంజీ విజిటర్ల 'డ్యూరేషన్ ఆఫ్ స్టే'పై పరిమితి విధించడం, హెచ్-1బి వీసాపై వార్షిక రుసుమును లక్ష డాలర్లకు పెంచుతూ తీసుకున్న నిర్ణయాలు వలసదారులను ఆందోళనకు గురిచేశాయి.

పర్యావరణాన్ని కాపాడుకోకపోతే అనర్థమే

- వాతావరణ మార్పులపై సదస్సులో యుఎన్ చీఫ్ గుటెరస్



బ్రెసిలీయా: పర్యావరణాన్ని కాపాడుకునేలా చర్యలు తీసుకోకపోతే అనర్థమేనని ఐక్యరాజ్యసమితి (యుఎన్) సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ హెచ్చరించాలి. బ్రెజిల్‌లోని బెలెమ్‌లో ఐక్యరాజ్యసమితి వాతావరణ మార్పు సమావేశాలు గురువారం నుంచి శుక్రవారం వరకూ జరిగాయి. ప్లీనరీ సెషన్ ప్రారంభోత్సవానికి హాజరైన యుఎన్ చీఫ్ మాట్లాడుతూ.. వాతావరణ మార్పులను పట్టించుకో కపోవటంతో.. వేడి అనుహ్యంగా పెరుగుతుందని వివరించారు. ప్రపంచ దేశాల పాలకుల నిర్లక్ష్యం వల్ల వాతావరణంపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. 2030 నాటికి ప్రపంచం 1.5 డిగ్రీల సెల్సియస్ వేడెక్కడం నిర్ణీత పరిమితిని దాటబోతోందని, కోలుకోలేని పరిణామాలతో తీవ్ర వేడి ఉండే ప్రమాదం పొంచి ఉందని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. 'వాతావరణ వినాశనం నుంచి చాలా కార్పొరేషన్లు రికార్డు లాభాలను ఆర్జిస్తున్నాయి. లాబీయింగ్ కోసం బిలియన్ల కొద్దీ ఖర్చు చేయడం, ప్రజలను మోసం చేయడం, పురోగతిని అడ్డుకోవడమే' అని గుటెరస్ స్పష్టం చేశారు. అంతేకాదు 'పలు దేశాల నాయకులు ఈ స్థిర ప్రయోజనాలకు బందీలుగా ఉన్నారు.' అని కూడా చెప్పారు. శిలాజ ఇంధనాలకు సబ్సిడీ ఇవ్వడంలో దేశాలు ప్రతి సంవత్సరం సుమారు ట్రిలియను యుఎస్ డాలర్లను ఖర్చు చేస్తున్నాయి. అయితే నాయకులకు రెండు స్పష్టమైన ఎంపికలు ఉన్నాయని వివరించారు. అందులో 'మనం పర్యావరణ రక్షణకు నాయకత్వం వహించడాన్ని ఎంచుకోవచ్చు - లేదా వినాశనానికి దారితీయవచ్చు.'అని గుటెరస్ అన్నారు.

రికార్డుస్థాయిలో వేడి

ప్రపంచ వాతావరణ చర్చలు ప్రారంభమై మూడు దశాబ్దాలు పూర్తయింది. ఆ సమయంలో, దేశాలు ఉద్గారాలలో అంచనా వేసిన పెరుగుదలను కొంతవరకు అరికట్టాయి. రాబోయే కొన్ని దశాబ్దాలలో తీవ్ర గ్లోబల్ వార్మింగ్‌గా భావించే వాటిని నిరోధించడానికి ఇది సరిపోదని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో అత్యంత వేడి ఉంటుందని ప్రపంచ వాతావరణ సంస్థ ప్రకటించింది. ఆగస్టు వరకు సగటు ఉష్ణోగ్రత పారిశ్రామిక పూర్వ సగటు కంటే 1.42డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉంది. 2023 , 2024లో రికార్డు స్థాయిలో వేడి నమోదైన తర్వాత. 'అసాధారణమైన ఉష్ణోగ్రతల ప్రభావం ఆందోళనకరమైన రీతిలో కొనసాగుతోంది' అని యూఎన్ చీఫ్ వివరించారు.



మీ కోసం

కాకరకాయ ముక్కలకు కొద్దిగా పెరుగు, ఉప్పు కలిపి పది నిమిషాలు నానబెట్టి వేపితే త్వరగా వేగుతాయి.

జీవన సౌరభం

ప్రపంచం మారాలని కోరుకోవడం కాదు, ఆ మార్పు మనతోనే మొదలవ్వాలి.

JEEVANA జీవన the family

చిట్టెలుక- నల్ల కాకి



చెట్టు కింద
బొరియలోన
చిట్టి ఎలుక ఒక్కటుంది
చెట్టు కింద రాలుతున్న
కాయ, గింజ
కొరుకుతోంది

భయం, బాధ లేకుండా
స్వేచ్ఛగా తిరుగుతోంది
చెరువు నీరు తాగుతోంది
కన్నంలో దూరుతోంది

ఆనందపు చిట్టెలుకకు
వచ్చే పెద్ద కష్టము
చెట్టుపైన వున్న
కాకి ఆకలిగా చూసేను

ఆహారం దొరకనపుడు
ఇదే మనకు ఆదరవు
అంతవరకూ హాయిగా
ఇక్కడే తిరగనిద్దాం

అని తలచెను నల్లకాకి
ఆశగా చిట్టిని చూస్తూ
కాకి తోటి ప్రమాదము
తలచే ఆ మూషికము

ఆ చెట్టుకి దూరంగా
పెద్ద పుట్ట ఒకటున్నది
బారెడంత తోకతోటి
సర్పము నివాసముంది

కొమ్మనున్న గూటిలోన
గుడ్లు పెట్టె పెద్ద కాకి
తెల్లనైన గుడ్లు పొదిగ
బుల్లి బుల్లి పిల్లలుట్టే

కేరు మన్న కాకి పిల్ల
ఆకలి అరుపులు వింది
కరతము బయటిపోగా
కబలించాలనుకుంది

పిల్లల ఆకలి తీర్చగ
ఊరివైపు పోయె కాకి
అదే అదునుగా తలచి
పాకే పాము చెట్టు పైకి.

ప్రమాదము గమనించెను
చిన్నదైన ఆ ఎలుక
కంగారుగ పరుగులిడి
అన్ని కాకులను పిలిచెను


ఒక్కసారి కాకులన్నీ
ఎగురుకుంటూ రాగానే
పలాయనం చిత్తగించే
భయంతోటి భుజంగము

అప్పుడే ఆహారంతో
వచ్చినట్టి తల్లికాకి
జరిగింది తెలుసుకుంది
చిట్టెలుకను చూసింది

అపకారం చేయాలని
చెడుగానే తలచాను
ఉపకారం చేసి నీవు
హృదయంలో నిలిచావు

అంటూ ఆ చిట్టెలుకను
ప్రశంసించే కాకమ్మ
స్నేహితుడవు నువ్వంటూ
చేయి చాచే ఎలుకమ్మ

– కూచిమంచి నాగేంద్ర,
91821 27880.



తేడాలు గుర్తించండి

పిల్లలూ! ఈ చిత్రంలో ఆరు తేడాలు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి.

నేను గీసిన బొమ్మ





ఎల్.పార్థవ్,
9వ తరగతి,
అరవింద హైస్కూలు
సీబీఎస్ఈ,
కుంచనపల్లి,
గుంటూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అతడు ఎమ్మెల్యే ఆమె పోలీసు అధికారి



ప్రజాప్రతినిధులు సాధారణ జీవితాలు గడపడం చాలా అరుదుగా కనిపిస్తుంది. అలాంటిది 'తన కుటుంబం గడవడానికి భార్య చేసే ఉద్యోగం చాలా కీలకమని స్పష్టం చేయడం' అంటే.. అది ఇంకా ఆశ్చర్యం. ఇటీవల కేరళ తిరువాంబడి నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే లింటో జోసెఫ్ తన భార్య అనూష స్టేట్ పోలీస్ అధికారి (సిపిఒ)గా నియామకం అయిన విషయాన్ని సోషల్ మీడియాలో షేర్ చేశారు. 'నా అను.. పోలీస్ ఆఫీసర్ అయ్యింది. దీని కోసం తను ఎంతో కష్టపడింది. నీకు శుభాకాంక్షలు డియర్' అంటూ ఆయన చేసిన ఈ పోస్టు చూసిన ఆయన అభిమానులు, సాధారణ ప్రజలు ఆ జంటని ప్రశంసలతో ముంచెత్తారు.

ఆ ఎమ్మెల్యే, ఆయన భార్య అనూష గురించి మరిన్ని విషయాలు తెలుసుకుంటే ఒక ప్రజాప్రతినిధి ఎలా ఉండాలి? ఆయన కుటుంబ సభ్యులు ఎలా ప్రవర్తించాలి? అన్న అవగాహన చాలామందికి అవగతమవుతుంది.

లింటో జోసెఫ్, అనూష విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐలో చురుకుగా పనిచేశారు. జిల్లా కార్యదర్శిగా లింటో, ఏరియా కార్యదర్శిగా అనూష సమర్థవంతమైన విధులు నిర్వర్తించారు. అక్కడ ఏర్పడ్డ పరిచయం, ప్రేమగా, ఆ తరువాత పెళ్లికి దారితీసింది. ఉన్నత భావాలు గల ఈ ఇద్దరు కుల, మత భేదాలకి తావివ్వకుండా ఎంతో నిరాడంబరంగా కోవిడ్ సమయంలో అంటే 2021లో పెళ్లి చేసుకున్నారు.

మూడు పోస్టులు వచ్చినా..

విద్యార్థి సంఘంలో పనిచేస్తూనే, మ్యాథమేటిక్స్‌లో పోస్టుగ్రాడ్యుయేట్ చేసిన అనూష, బ్యాంకు ఉద్యోగాల కోసం ప్రయత్నించేవారు. కేరళ పబ్లిక్ కమిషన్ సర్వీస్ కోచింగ్ కూడా తీసుకున్నారు. కోవిడ్ సమయంలో కాస్తంత విరామం ఇచ్చినా ఇరు కుటుంబాల మద్దతుతో తిరిగి తన ప్రయత్నాలు మొదలుపెట్టారు. 'ఎంత కష్టపడైనా ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడమే నా లక్ష్యం' అనే అనూష సిపిఒ పోస్టుని ఏకకాలంలోనే సాధించారు. దీంతో పాటు మరో మూడు ప్రభుత్వ పోస్టులు వచ్చినా 'ప్రజలకి సేవ చేసే రంగమైన పోలీస్ ఉద్యోగాన్నే అనూష ఎంచుకున్నట్లు' లింటో తన పోస్టులో రాశారు.

'ఎమ్మెల్యే భార్య' అని ఎవరికీ తెలియదు..

ఇక్కడ మనం అనూష పోలీస్ ట్రైనింగ్‌లో పాటించిన విధానాన్ని తప్పక తెలుసుకోవాలి. శారీరక దృఢత్వం కోసం అనూష స్థానిక స్పోర్ట్స్ అకాడెమీలో శిక్షణ తీసుకున్నారు. మొత్తం శిక్షణా కాలం 9 నెలలు. ఈ సమయంలో ఆమె సాధారణ మహిళగానే అక్కడ ఉన్నారు. తను ఒక ఎమ్మెల్యే భార్య అని ఎవరికీ తెలియకుండా జాగ్రత్తపడ్డారు. తనని డ్రాప్ చేయడానికి లింటో వచ్చినప్పుడు చూసిన అధికారులకి మాత్రమే తన గురించి తెలిసేది. మిగతావారు అంటే తనతో ట్రైనింగ్‌లో పాల్గొన్న వారందరికీ శిక్షణ చివరి రోజు ఇటీవల త్రిస్సూర్‌లో జరిగిన పరేడ్‌లోనే తను లింటో భార్య అని తెలిసింది. దీనిపై ఆమె ఇలా మాట్లాడారు.

'నేను అందరిలాంటి మహిళనే. ఎమ్మెల్యే భార్యగా నాకు అదనపు ఆర్భాటాలేవీ లేవు. 211వ ర్యాంకు సాధించిన నేను త్రిస్సూర్ పోలీస్ అకాడెమీలో ఫిబ్రవరి నుండి ట్రైనింగ్ తీసుకున్నాను. ఫిజికల్ ఫిట్‌నెస్ ట్రైనింగ్, క్లాసులకి హాజరవ్వడం ఏకకాలంలోనే సాధన చేశాను. ఉదయం, రాత్రి వేళల్లో రెండు సెషన్లు పూర్తిచేయాలని చాలా కష్టపడ్డాను. నా యోగక్షేమాలు తెలుసుకోవడానికి లింటో నెలకి ఒకసారి వచ్చేవారు. అప్పుడు మాత్రమే నేను ఎమ్మెల్యే భార్యని అని కొంతమందికి తెలిసింది' అంటున్న అనూష ఈ నవంబరు 3న సిపిఒగా బాధ్యతలు తీసుకున్నారు. ఇది తనకి ఆరంభమని, ఇంకా చదువు కొనసాగిస్తానని, పోటీపరీక్షలు రాస్తానని ఆమె చెప్పారు.

ఈ విజయం అంకితభావానికి నిదర్శనం

అనూష సాధించిన విజయాన్ని కొనియాడుతూ లింటో తన పోస్టులో ఇలా రాశారు. 'ఆమె ఈ సేవలోకి ప్రవేశించడం ద్వారా ప్రజాప్రతినిధుల కుటుంబాలు మనుగడ సాగించడానికి ఆ కుటుంబంలోని వ్యక్తులు పనిచేయడం ఎంతో కీలకమైనదని స్పష్టమవుతోంది. ఒక ఎమ్మెల్యేగా మా ఇల్లు ఎప్పుడూ జనాల తాకిడితో రద్దీగా ఉండేది. నా భార్య అప్పుడు కూడా తన బాధ్యతలు సమర్థ వంతంగా నిర్వర్తించింది. చదువు కొనసాగించింది' అని ఆయన ఎంతో గర్వంగా రాశారు.

పోటీపడి శిక్షణ తీసుకుంది..

ఈ వ్యాఖ్యకి అనూష స్నేహితులు, క్లాస్‌మేట్స్ నుండి విశేషంగా స్పందన వచ్చింది. అందులో ఒకరు ఇలా రాశారు. 'ఈ సంఘటన.. సాధారణంగా ప్రజాప్రతినిధులు బ్యాక్‌డోర్ ద్వారా తమకి కావాల్సిన పనులు చేయించుకుంటారన్న వాదనని కొట్టిపారేసింది. అనూష మాతో పోటీపడి శిక్షణ తీసుకుంది. అప్పుడు తను ఎవరో మాకు తెలియదు. ఇప్పుడు తన గురించి తెలిసి ఎంతో గర్వపడుతున్నాం. అంకితభావం, పట్టుదలకి గుర్తుగా అనూష మాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది' అని ఆమెని కొనియాడారు. కేరళ పర్యాటక శాఖా మంత్రి పి.ఎ.మొహ్మద్ రియాస్, ఇతర ప్రముఖులు కూడా అనూషని, ఆమెకి ప్రోత్సాహం ఇచ్చినందుకు లింటోని అభినందించారు.

– వై. విశ్వప్రసాద్



జుట్టు సంరక్షణకు బిల్ల గన్నేరు

ప్రకృతిలో ఉన్న ఎన్నో మొక్కలు మన ఆరోగ్యానికి, సౌందర్యానికి సహాయపడతాయి. వాటిల్లో బిల్ల గన్నేరు మొక్క ఒకటి. దాని ఆకులు, పువ్వుల్లో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. జుట్టు సంరక్షణ కోసం వీటితో నూనె కూడా తయారుచేసుకోవచ్చు.

అవసరమైన పదార్థాలు : బిల్ల గన్నేరు ఆకులు : 10 నుండి 15, పువ్వులు 3 నుండి 4 తీసుకోవాలి. కొబ్బరి నూనె :1 కప్పు, మెంతులు :1 టీస్పూన్, ఆముదం నూనె : 1 టేబుల్ స్పూన్ సిద్ధం చేసుకోవాలి.

తయారీ విధానం : ఆకులు, పువ్వులు బాగా కడిగి నీడలో ఆరనివ్వాలి. పాన్‌లో కొబ్బరి నూనె వేసి వేడి చేయాలి. అందులో ఆరిన ఆకులు, పువ్వులు వేసి చిన్న మంటపై మరగించాలి. నూనె కొద్దిగా రంగు మారి వాసన వచ్చే వరకు (సుమారు 5-7 నిమిషాలు) ఉంచాలి. ఇప్పుడు ఈ మిశ్రమలో మెంతులు, ఆముదం నూనె వేసి మరో 2 నిమిషాలు వేడి చేయాలి. ఆ తరువాత గ్యాస్ ఆఫ్ చేసి చల్లారనివ్వాలి. వడకట్టి సీసాలో నిల్వచేయాలి.

వాడే విధానం : వారానికి 2 సార్లు నూనెను తల మీద మర్దన చేసుకోవాలి. 30 నిమిషాల నుంచి 1 గంట తర్వాత సాదా షాంపూతో తలని కడగాలి. లాభాలు : చుండ్రు తగ్గించడంలో సహాయపడుతుంది. జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది. తల చర్మం చల్లగా ఉంచుతుంది. తలలో మంట, దురద తగ్గిస్తుంది. జుట్టు మృదువుగా, మెరిసేలా చేస్తుంది.

జాగ్రత్తలు : ఈ మొక్కలో కొద్దిగా విషపూరిత గుణాలు ఉంటాయి. కాబట్టి అధిక మోతాదులో వాడరాదు. మొదటిసారి వాడేముందు చేతిపై కొద్దిగా రాసి పరీక్షించుకోవాలి. అలెర్జీ, దురద, లేదా మంట ఉంటే వాడకూడదు. పిల్లలకు వాడేముందు వైద్యుడి సలహా తీసుకోవాలి.



'కుంభ'గా పృథ్వీరాజ్

మహేశ్‌బాబు, ఎస్.ఎస్.రాజమౌళి సినిమా 'ఎస్ఎస్ఎంబి 29' నుంచి తాజా అప్‌డేట్ వచ్చేసింది. ఈ మూవీలో కీలకపాత్రలో నటిస్తున్న పృథ్వీరాజ్ సుకుమారన్ ఫస్ట్‌లుక్‌ను తాజాగా విడుదల చేశారు. కుంభ పాత్రలో పృథ్వీరాజ్ కనిపించన్నున్నారని చిత్ర యూనిట్ ప్రకటించింది. ఈ పాత్ర గురించి రాజమౌళి ఇలా చెప్పారు. 'పృథ్వీతో మొదటి షాట్ చిత్రీకరించిన తర్వాత, నేను అతని దగ్గరకు వెళ్లి, మీరు నాకు తెలిసిన అత్యుత్తమ నటుల్లో ఒకరని చెప్పాను. ఈ దుష్ట, క్రూరమైన, శక్తివంతమైన విరోధి కుంభకు ప్రాణం పోయడం సృజనాత్మకంగా చాలా సంతృప్తికరంగా ఉంది. పృథ్వీకి ధన్యవాదాలు' అంటూ ఆయన ఒక పోస్ట్ చేశారు. చిత్రబృందం నవంబర్ 15న ఒక భారీ ఈవెంట్ జరపనుంది. ఆ రోజు సినిమా టైటిల్‌తో పాటు మహేష్ బాబు ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయనున్నారు. ఈ క్రమంలోనే సుమారు 2 నిమిషాలకు పైగా ఉండే ఒక వీడియోను కూడా అభిమానులతో పంచుకోనున్నారు. ఈ వేడుక కోసం ఇప్పటికే ప్రియాంకచోప్రా హైదరాబాద్ చేరుకున్నారు.

బహుముఖ ప్రతిభాశాలి సులక్షణ పండిట్




హిందీ సినిమా ప్రసిద్ధ గాయని, నటి సులక్షణ పండిట్ (71) గురువారంనాడు గుండెపోటుతో కన్నుమూశారు. ఈ విషయాన్ని ఆమె సోదరుడు, ప్రసిద్ధ సంగీత స్వరకర్త లలిత్ పండిట్ ధృవీకరించారు. ఆమె గాయనిగా, నటిగా బహుముఖ ప్రజ్ఞాశాలి. సులక్షణ పండిట్ 1954 జూలై 12న ఛత్తీస్‌ఘడ్‌లోని రాయ్‌ఘడ్‌లో జన్మించారు. ఆమె కుటుంబం సంగీతం, కళా రంగంతో ముడిపడి ఉంది. ఆమె శాస్త్రీయ గాయకుడు పండిట్ జస్‌రాజ్ కోడలు. బాలీవుడ్ ప్రసిద్ధ సంగీత స్వరకర్తల ద్వయం జతిన్-లలిత్ సోదరి. బాల్యం నుండే సంగీత శిక్షణ పొందారు. 1975లో విడుదలైన 'ఉల్జన్' చిత్రంతో తన సినీ నటజీవితాన్ని ప్రారంభించారు. తర్వాత,అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించారు, వాటిలో 'హేరా ఫేరీ', 'అప్నాదాన్', 'ఖాండాన్', 'చెహ్రే పే చెహ్రా', 'ధరమ్ కాంటా', 'వక్త్ కీ దీవార్' వంటివి ఉన్నాయి. ఆమె నటనకు సంబంధించిన నైపుణ్యం, తెరపై సహజత్వం ఆమెను ఆ కాలంలోని అత్యుత్తమ నటీమణుల్లో ఒకరిగా మార్చింది. ఆమె తన తొమ్మిదో ఏట నుంచే పాటలు పాడటం ప్రారంభించారు. 1967లో నేపథ్య గాయనిగా పరిచయమయ్యారు.



'పెద్ది' చికిరి.. వచ్చేసింది!

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు డైరెక్షన్‌లో వస్తున్న సినిమా 'పెద్ది'. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో సుకుమార్ రైటింగ్స్‌తో ఈ సినిమా తెరకెక్కుతోంది. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. స్పోర్ట్స్ ప్రధాన అంశంగా తెరకెక్కుతున్న ఈ సినిమాను బుచ్చి బాబు భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుండి ఫస్ట్ సింగిల్ చికిరి వీడియో సాంగ్‌ని చిత్రబృందం విడుదల చేసింది. బాలాజీ రాసిన ఈ సాంగ్‌ను మోహిత్ చౌహాన్ ఆలపించారు. ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా చేస్తున్నారు. వచ్చే ఏడాది వేసవిలో మార్చి 27న ఈ చిత్రం విడుదల కాబోతోంది.



మలయాళ చిత్రంలో అనుష్క

అనుష్క శెట్టి చాలా కాలం తర్వాత మళ్లీ పెద్ద తెరపై కనిపించనున్నారు. మలయాళ ఫాంటసీ థ్రిల్లర్ చిత్రం 'కథనార్ : ది వైల్డ్ సోర్సెరర్'లో ఆమె కీలకపాత్ర చేయనుంది. ఈ సినిమాకు రోజిన్ థామస్ దర్శకత్వం వహిస్తున్నారు. మలయాళ నటుడు జయసూర్య ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని గోకులం గోపాలన్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. 9వ శతాబ్దం నేపథ్యంగా సాగే ఈ కథలో మాంత్రిక శక్తులు, ఆధ్యాత్మిక అంశాలు, సస్పెన్స్ థ్రిల్లర్ ఎలిమెంట్స్ ప్రధానంగా ఉండనున్నాయి. విఎఫ్ఎక్స్ పరంగా కూడా సినిమాను గ్రాండ్‌గా తీర్చిదిద్దుతున్నారు.

సిరీస్‌పై టీమిండియా గురి

- నేడు ఆస్ట్రేలియాతో ఐదో, చివరి టి20
- మధ్యాహ్నం 1.45ని.లకు



బ్రిస్బేన్: ఐదు టి20ల సిరీస్‌లో భాగంగా 2-1 ఆధిక్యతలో ఉన్న టీమిండియా.. ఇక సిరీస్‌పై గురిపెట్టింది. రెండో టి20లో చిత్తుగా ఓడినా.. ఆ తర్వాత మ్యాచుల్లో టీమిండియా గెలిచి సిరీస్‌ను చేజారకుండా నిలుపుకుంది. తొలి మ్యాచ్‌లో ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకున్న టీమిండియా ఆటగాళ్లు ఆ తర్వాత మ్యాచుల్లో సమిష్టిగా రాణిస్తున్నారు. శుభ్‌మన్ గిల్‌కి తోడు అభిషేక్ శర్మ ఫామ్‌లో ఉండడం మనకు కలిసిరానుంది. ఆల్‌రౌండర్లు సుందర్, దూబే, అక్షర్ టీమిండియా గెలుపులో కీలకపాత్ర పోషిస్తున్నారు. వన్డే సిరీస్‌ను చేజార్చుకున్న టీమిండియా.. కనీసం టి20 సిరీస్‌నైనా చేజిక్కించుకొని వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే ప్రపంచకప్‌పై సంసిద్ధత కావాలని చూస్తోంది. మూడో టి20లో ఆసీస్ నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని టీమిండియా మరో 9బంతులు మిగిలి ఉండగానే సునాయాసంగా ఛేదించింది. సుందర్, అక్షర్, వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో రాణిస్తున్నారు. ఇక టీమిండియా బ్యాటర్లు అభిషేక్ శర్మ, తిలక్ వర్మ కూడా ఓ అరుదైన మైలురాయిపై కన్నేశారు. అభిషేక్ 11, తిలక్ 4 పరుగులు చేస్తే టి20ల్లో 1000 పరుగులు పూర్తి చేసుకుంటారు. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో భారత్ వరుసగా మూడు, నాలుగు మ్యాచ్‌లు గెలిచి 2-1 ఆధిక్యంలో ఉంది. రేపటి మ్యాచ్‌లోనూ గెలిస్తే టీమిండియా హ్యాట్రిక్ విజయాలు సాధించడంతో పాటు సిరీస్ కైవసం చేసుకుంటుంది.

ఇక ఆసీస్ జట్టు నాల్గో టి20లో మన స్పిన్నర్లను ఎదుర్కోవడంలో తడబడ్డారు. టీమిండియా నిర్దేశించిన 168 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో 119పరుగులకే పరిమితమ య్యారు. తొలి టి20 వర్షం కారణంగా రద్దు కాగా.. రెండో టి20లో టీమిండియాను కట్టడి చేయడంలో మాత్రమే ఆసీస్ బౌలర్లు సఫలమయ్యారు.

నయా చరిత్రకు అడుగు దూరంలో బుమ్రా

టీమిండియా పేసర్ జస్ప్రీత్ బుమ్రా చరిత్ర సృష్టించేందుకు అడుగు దూరంలో నిలిచాడు. ఆస్ట్రేలియాతో శనివారం జరిగే ఐదో టి20లో ఓ వికెట్ తీస్తే.. టి20 ఫార్మాట్‌లో 100వికెట్లు పూర్తి చేసుకోవడంతో పాటు మూడు ఫార్మాట్లలో 100 వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా రికార్డు నెలకొల్పుతాడు. ఇప్పటివరకు ఏ భారత బౌలర్ మూడు ఫార్మాట్లలో 100 వికెట్లు తీయలేదు. టి20ల్లో అర్ష్‌దీప్ సింగ్ మాత్రమే ఇప్పటివరకు 100 వికెట్లు పూర్తి చేశాడు. ఓవరాల్‌గా టి20ల్లో అత్యధిక వికెట్లు తీసిన రికార్డు ఆఫ్ఘనిస్తాన్ ఆటగాడు రషీద్ ఖాన్ పేరిట ఉంది. రషీద్ 108 టి20ల్లో 182 వికెట్లు తీసి అగ్రస్థానంలో ఉన్నాడు.

జట్లు(అంచనా)...

ఇండియా: సూర్యకుమార్(కెప్టెన్), శుభ్‌మన్, జితేశ్ శర్మ(వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, దూబే, సుందర్, అక్షర్, అర్ష్‌దీప్/కుల్దీప్, వరణ్ చక్రవర్తి, బుమ్రా.

ఆస్ట్రేలియా: మార్ష్(కెప్టెన్), ఇంగ్లిస్(వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, మ్యాక్స్‌వెల్, ఓవెన్/ఫిలిప్పే, స్టొయినీస్, బార్ట్‌లెట్, జంపా, ఎల్లిస్, కుహ్నేమన్, షార్ట్.

అట్టహాసంగా రెవెన్యూ క్రీడా సంబరాలు

- ప్రారంభించిన సిసిఎల్ఎ స్పెషల్ సెక్రటరీ జి జయలక్ష్మి



క్రీడా జ్యోతితో అధికారులు, రెవెన్యూ ఉద్యోగులు

ప్రజాశక్తి -అనంతపురం

ఎపి రెవెన్యూ ఉద్యోగుల క్రీడా సంబరాలు శుక్రవారం అట్టహాసంగా ఆరంభమయ్యాయి. మూడు రోజుల పాటు అనంతపురం నగరంలోని ఆర్‌డిటి క్రీడా గ్రామంలో ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ క్రీడలను సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి జయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆ గీతాలాపన జరిగింది. అనంతరం రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన రెవెన్యూ క్రీడాకారుల బృందాలు మార్చుఫాస్టు నిర్వహించాయి. ఈ మార్చుఫాస్టులో కాకినాడ మొదటి స్థానం, అనంతపురం ద్వితీయ స్థానం, తూర్పుగోదావరి మూడవ స్థానం, నంద్యాల నాలుగో స్థానంలో నిలిచాయి. ఈ బృందాలను సిసిఎల్ఎ చీఫ్ కమిషన్ జి జయలక్ష్మి సత్కరించారు.

మైదానంలో దిగి జయలక్ష్మి క్రికెట్ బ్యాట్ పట్టి బ్యాటింగు చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి రెవెన్యూ ఉద్యోగులు ఇక్కడికి విచ్చేసి ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. అనంతరం అవుట్‌డోర్, ఇండోర్ ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం ఆరు గంటల నుంచి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్, సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఉమ్మడి జిల్లాల జాయింట్ కలెక్టర్లు శివ నారాయణ శర్మ, మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టరు సచిన్ రహార్, డిఆర్ఒ మలోల, సత్యసాయి జిల్లా డిఆర్ఒ సూర్యనారాయణరెడ్డి, ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఎపి రెవెన్యూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేశ్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68